




# విజయభాను








విశాఖపట్నం, మంగళవారం 21-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 217 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## 34 చోట్ల 55 కేంద్రాల్లో కౌంటింగ్

- 23వ తేదీ ఉదయం 8నుంచే లెక్కింపు
- 25 వేలమంది సిబ్బంది, 200మంది పరిశీలకులు
- కౌంటింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వీడియో కాన్ఫరెన్స్
- రీకౌంటింగ్ నిర్ణయాధికారం ఆర్వో, అబ్జర్వర్లదే
- ఏపీ సీఈవో గోపాలకృష్ణ ద్వివేది



అమరావతి: రీపోలింగ్ ముగియడంతో ఎన్నికల సంఘం కౌంటింగ్‌పై దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్‌లో 34 చోట్ల 55 కేంద్రాల్లో కౌంటింగ్ ప్రక్రియకు 13 జిల్లాల కలెక్టర్లు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 23వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. ఇందుకోసం 25వేలమంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం కౌంటింగ్ ప్రక్రియకు 200మంది పరిశీలకులను నియమించింది. గురువారం ఉదయం ఎనిమిది గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు ప్రారంభిస్తారు.

8.30 గంటల నుంచి ఈవీఎంల లెక్కింపు ప్రారంభిస్తారు. ఒక నియోజకవర్గంలో ఈవీఎంల లెక్కింపు అన్ని రౌండ్లు పూర్తయిన తరువాత ఐదు వీవీప్యాట్ యంత్రాలను లాటరీ విధానంలో తీస్తారు. ఆ వీవీ ప్యాట్‌ల్లోని స్లిప్పులను లెక్కించడం పూర్తయిన తరువాతనే ఆ నియోజకవర్గ ఫలితాన్ని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తెలియజేసిన తరువాత అధికారికంగా వెల్లడిస్తారు. వీవీప్యాట్ యంత్రాల్లో స్లిప్పులు లెక్కించడానికి సమయం పట్టనుంది. అందువల్ల అధికారికంగా ఫలితాల వెల్లడికి ఆలస్యమైనప్పటికీ ఈవీఎంలు లెక్కించిన తరువాత అనధికారికంగా ఫలితాలు తెలిసిపోతాయి.

మరోవైపు ఏపీ సీఈవో గోపాలక ృష్ణ ద్వివేది కౌంటింగ్ ఏర్పాట్లు, భద్రతా చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల ఎన్నికల పరిశీలకులు, ఎస్పీలు, సీపీలు, ఆర్వోలు ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

అనంతరం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ద్వివేది మీడియా ప్రతినిధులతో చిట్ చాట్ చేశారు. 'కౌంటింగ్‌లో వీవీ ప్యాట్‌లో స్లిప్పులు, ఫారం-17సీ లెక్కలతో సరిపోవాలి. కౌంటింగ్‌కు ముందు మాక్ పోల్ రిపోర్టు కూడా లెక్కలతో సరిపోవాలి. వీవీ ప్యాట్ స్లిప్పులు ఈవీఎం ఓట్లతో సరిపోవాలి. ఎన్నికల లెక్కింపులో సందేహాలు వస్తే పోలింగ్ డైరీ రిపోర్టుల ఆధారంగా నిర్ణయం ఉంటుంది. సాంకేతిక సమస్యలు, వివాదాలు తలెత్తిన చోట ఫలితాలపై ఈసీదే నిర్ణయం. మొరాయించిన ఈవీఎంల లెక్కింపు కౌంటింగ్ చివర్లో జరుపుతాం. ఓట్ల లెక్కింపుపై పార్టీల మధ్య భేదాభిప్రాయాలు వస్తే ఆర్వోదే నిర్ణయాధికారం.

ఏదైనా కేంద్రంలో తక్కువ మార్జిన్ వస్తే రీకౌంటింగ్‌కు అవకాశం ఉంటుంది. రీకౌంటింగ్ నిర్ణయాధికారం ఆర్వో, అబ్జర్వర్లదే' అని తెలిపారు.

### అభివృద్ధి, సంక్షేమం వల్లే

## విజయం సాధిస్తాం

- నూటికి వెయ్యి శాతం మేమే గెలుస్తాం!
- సాంకేతికతను దుర్వినియోగం చేస్తే తీవ్ర పరిణామాలు
- తేడా వస్తే మొత్తం స్లిప్పులు లెక్కించాల్సిందే
- ఏపీ సీఎం చంద్రబాబు ధీమా



అమరావతి: సర్వేలు చేసుకోవడం అందరికీ అలవాటుగా మారిందని తెదేపా అధినేత, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. తెదేపా 35 ఏళ్లుగా సర్వేలు చేస్తోందని.. నూటికి వెయ్యి శాతం ఏపీలో తామే గెలుస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అమరావతిలో చంద్రబాబు మీడియాతో మాట్లాడారు.

**గెలుపుపై అనుమానం అక్కర్లేదు..**

తెదేపా గెలుపుపై ఎవరికీ ఎలాంటి అనుమానం అక్కర్లేదు. అభివృద్ధి, సంక్షేమం వల్లే తెదేపా విజయం సాధిస్తుంది. నేను ఒక్క పిలుపు ఇస్తే అందరూ వచ్చి అర్ధరాత్రి దాటే వరకూ ఓటు వేశారు. అనేక ఇబ్బందులు పడి తెలంగాణ నుంచి వచ్చి ఓటు వేశారు. సాంకేతికతను దుర్వినియోగం చేస్తే పరిణామాలు తరువాయి 2లో..



### లగడపాటి ఎగ్జిట్‌పోల్‌ను నమ్మి

## ఊహల్లో విహరిస్తున్నారు

- సోనియా, ఉత్తరాది నేతల పాదాల ముందు ఏపీని పడేశారు
- బాబును 'ఫెవికాల్ బాబా' అంటున్నారు
- సొంత రాష్ట్రంలో గెలవలేక ఢిల్లీలో తిరుగుతున్నారు
- వైఎస్సార్ సీపీ నేత విజయసాయి రెడ్డి

హైదరాబాద్ : కాంగ్రెస్ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ ఎగ్జిట్ పోల్ సర్వేపై వైఎస్సార్ సీపీ నేత విజయసాయి రెడ్డి ట్విటర్ వేదికగా వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'లగడపాటి ఎగ్జిట్ పోల్ సర్వేను నమ్మి ఎగ్జయిట్ అయిన తెలుగు తమ్ముళ్లు ఈ నెల తరువాయి 2లో..

## సినీ నటుడు రాళ్ళపల్లికి కన్నీటి వీడ్కోలు



రాయదుర్గం: సినీ హాస్యనటుడు రాళ్ళపల్లి వెంకట నరసింహారావుకు ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో కన్నీటి వీడ్కోలు పలికారు. ఆయన అంత్యక్రియలు రాయదుర్గం మహాప్రస్థానంలో సోమవారం ఉదయం నిర్వహించారు. మొదట తన నివాసం నుంచి ప్రారంభమైన ఆయన తరువాయి 2లో..






## దుస్సాహసానికి పాల్పడితే గట్టిగా బదులిస్తాం

- పాక్‌కు భారత ఆర్మీ హెచ్చరిక
- భారత ఆర్మీ ఉత్తర కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్



శ్రీనగర్ (జమ్ముకశ్మీర్): పాకిస్థాన్ దుస్సాహసానికి పాల్పడితే గట్టిగా బదులిస్తామని భారత ఆర్మీ ఉత్తర కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ రణ్‌బీర్ సింగ్ హెచ్చరించారు. సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ పాక్‌లోని బాలాకోట్‌లో భారత్ నిర్వహించిన దాడులను కొనియాడారు. పాక్‌లోని బాలాకోట్‌లో ఉన్న ఉగ్ర శిబిరాలపై ఫిబ్రవరి 26న భారత వైమానిక దళాలు చేసిన దాడులు ప్రశంసనీయం. ఇది చాలా గొప్ప విజయం.. పాక్ భూభాగంలో చాలా లోపలికి వెళ్లి ఉగ్ర శిబిరాలపై దాడులు నిర్వహించారు. ఆ తదుపరి రోజే.. నియంత్రణ రేఖ వద్ద పాక్ వైమానిక దళ ఆపరేషన్లను మొదలు పెట్టింది. అయినప్పటికీ వారికి గట్టిగా బుద్ధి చెప్పాం అని వ్యాఖ్యానించారు.

నియంత్రణ రేఖల వద్దకు వచ్చి దుశ్చర్యలకు పాల్పడే ధైర్యం పాక్ చేయొద్దు. భారత మిలిటరీ వ్యూహాలన్నీ పూర్తిగా స్పష్టంగా ఉన్నాయి. పాక్ భద్రతా బలగాలు ఎటువంటి దుస్సాహసానికి పాల్పడినా గట్టిగా బదులిస్తాం. పాకిస్థాన్ నుంచి ఎదురయ్యే ఎటువంటి సవాళ్లనయినా ఎదుర్కొనేందుకు, ఆపరేషన్ ప్రణాళికలను సమర్థవంతంగా నిర్వహించడానికి భారత ఆర్మీ పూర్తిగా శక్తిమంతంగా ఉందని నేను భరోసా ఇస్తున్నాను. జమ్ముకశ్మీర్‌లో భద్రత పూర్తిగా నియంత్రణలో ఉంది. పాకిస్థాన్.. భారత వ్యతిరేక చర్యలను తరువాయి 2లో..

## శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు పిడుగుపాటు హెచ్చరికలు



అమరావతి : శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో పిడుగులు పడే అవకాశముందని ఆర్టీజీఎస్ అధికారులు హెచ్చరించారు. విజయనగరం జిల్లా కురుపాం మండలానికి పిడుగుపాటు హెచ్చరికలు జారీచేశారు. శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాల్లో పిడుగులు పడే అవకాశం ఉందని తెలిపారు. అలాగే సీతంపేట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు సైతం ఆర్టీజీఎస్ అధికారులు హెచ్చరికలను జారీచేశారు.

## ఇ-ఆఫీసు అమలులో అధికారులు వేగవంతం కావాలి

- మీ కోసం, మీ సేవ, ఇ-ఆఫీసు మొదలగు అంశాలపై సమీక్ష
- నిర్దిష్టమైన కారణము లేకుండా దరఖాస్తును తిప్పివేయరాదు
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టరు కె.భాస్కర్



విశాఖపట్నం: ప్రభుత్వ కార్యాలయాల ద్వారా ప్రజలకు అందించే వివిధ సేవల విషయంలో అధికారులు శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టరు కె.భాస్కర్ అధికారులకు సూచించారు. సోమవారం ఉదయం కలెక్టరు మీ కోసం, మీ సేవ, ఇ-ఆఫీసు మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భముగా కలెక్టరు మీ సేవలో సేవల కోసం ధరఖాస్తుదారులు రుసుము చెల్లిస్తారని, సకాలంలో సేవలు అందించాలని అధికారులకు సూచించారు. సదరు దరఖాస్తును నిర్దిష్టమైన కారణము లేకుండ త్రిప్పివేయరాదన్నారు. రెవెన్యూ, సివిల్ సప్లైస్, రిజిస్ట్రేషన్ శాఖలలో దరఖాస్తుల పెండింగు శాతం పెరుగుతోందని అధికారులు సత్వరమే వాటిని పరిష్కరించాలన్నారు. మీ సేవలో దరఖాస్తు చేసుకున్న వారిని కార్యాలయాల చుట్టూ తరువాయి 2లో..




# ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు : జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్



విజయనగరం:స్థానిక ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆధ్వర్యంలో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఇందులో జిల్లా నుంచి వివిధ ప్రాంతాలనుంచి ఫిర్యాదుదారులు వచ్చి నేరుగా ఎస్పీతో తమ ఫిర్యాదులపై పరిష్కారం కోరారు. మక్కువ మండలం, సరాయివలస గ్రామానికి చెందిన కర్రి బాలప్రసాదరావు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన అక్కెన రాములు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి దురాక్రమణకు పాల్పడుతున్నాడని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఇరు వర్గాలను పిలిపించి, డాక్యుమెంట్లును పరిశీలించి, రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరించాల్సిందిగా మక్కువ ఎస్ఐను ఆదేశించారు. విజయనగరం పట్టణానికి చెందిన రాజేశ్వరి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు శ్రీనివాసరావుతో వివాహంజరిగిందని తరువాత వారికి ఇద్దరు ఆడపిల్లలు పుట్టారని, అప్పటి నుండి తన భర్త ఆమెను శారీరకంగా, మానసికంగా వేధిస్తూ, వారి బాగోగులు చూడటం లేదని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదిపై స్పందినఎస్పీ ఇరువురిని పిలిపించి, భార్య పిల్లలను సరిగా చూచుకునేలా భర్తకు కౌన్సిలింగు నిర్వహించాలనివిజయనగరం రూరల్ ఎస్ను ఆదేశించారు.విజయనగరం మండలంకు చెందిన జమునరాణి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ ఆమె యొక్క సెల్ఫోన్కి గుర్తుతెలియని వ్యక్తుల నుండి తప్పుడు కాల్స్, అసభ్యకర వాట్సాఫ్ మెసేజులు పెడుతున్నారని, వారిపై చర్య తీసుకొని న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ వెంటనే అసభ్యకర మెసేజ్లు పెడుతున్న వారి వివరాలు సేకరించి తనకు నివేధించాలని ఐటి.కోర్ టీం ని ఆదేశించారు. దత్తిరాజేరు గ్రామానికి చెందిన కంది ఆదినారాయణ ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు ఇద్దరు కుమారులు కలరని, ఆ ఇద్దరు కుమారులు తనను సరిగా చూడటం లేదని, ఆస్తిలో తనకు ఎటువంటి వాటా లేదని ఇంటి నుండి భయటకు పంపి వేస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించినఎస్పీ ఇరువురికి కౌన్సిలింగు నిర్వహించి, తన తండ్రిని సరిగా చూచుకునేలా సమస్యను పరిష్కరించాలని మానాపురం ఎస్ఐను ఆదేశించారు. ఎస్.కోట గ్రామానికి చెందిన శేషు మరియు ఉమామహేశ్వరరావులు ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ వారికి గల భూమిలో ధర్మవరంకు చెందిన కనకరాజు మరియు మరి కొంతమంది కలిసి దురాక్రమణకు పాల్పడి నిర్మాణాలు చేపడుతున్నారని, అడిగితే వారితో గొడవ పడుతున్నారిన న్యాయం చేయాల్సిందిగా కోరారు.

ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఇరు వర్గాలను పిలిపించి, డాక్యుమెంట్లును పరిశీలించి, రెవెన్యూ అధికారుల సహకారంతో సమస్యను పరిష్కరించాల్సిందిగా ఎస్.కోట ఎస్ఐను ఆదేశించారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ సిఐలు రామకృష్ణ, వైవి శేషు, పాల్గొన్నారు.

## మూడు నెలల్లో పెద్దచెరువు రూపురేఖలు మారుస్తాం:

### జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్



విజయనగరం : పెద్దచెరువు శుద్ధిపట్ల ప్రజల్లో చైతన్యం వచ్చిందని, స్వచ్ఛందంగా సేవలో పాల్గొంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారని జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్ అన్నారు. మూడు నెలల్లో పెద్ద చెరువు రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. సోమవారం ఉదయం పురపాలక సంఘం సిబ్బంది, 11వ వార్డు నుండి స్వచ్ఛందంగా వచ్చిన ప్రతినిధులు సంయుక్తంగా పెద్దచెరువు శుద్ధి సేవలో పాల్గొన్నారు. శుద్ధిసేవలో పాల్గొన్న ప్రతీ ఒక్కరికి జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. పెద్దచెరువు ప్రాంతాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పురోగమిస్తున్నామన్నారు. చెరువు అభివృద్ధికి అందరి భాగస్వామ్యం అవసరమన్నారు. చెరువు ప్రాంతాన్ని ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకునివస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ పెద్దచెరువు దక్షిణగట్టు ప్రాంతాన్ని పరిశీలించి, శుద్ధికి సంబంధించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.ఎస్.వర్మ, మున్సిపల్ ఇంజనీర్ మత్స్యరాజు, ఎంహెచ్ఓ డా.రత్నదీపక్, ఐఎంఎ ప్రతినిధి డా.వెంకటేశ్వరరావు, మావూరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జి.విశాల తదితరులు పాల్గొన్నారు.

## జోన్-5ప్రజావాణికి 46 వినతులు



గాజువాక: జోన్-5 గాజువాక జీవీయంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన పలు సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 46 వినతల అందాయి. యుసిడి-1, యుజిడి-1, ఏడిఇ-1, ఎలక్ట్రికల్-5 టౌన్‌ప్లానింగ్ 11,రెవెన్యూ-8, నీటి సరఫరా-7, ఎ.ఎం.హెచ్.ఓ-6 ఇంజినీరింగ్ విభాగం-6 చొప్పున మొత్తం 46 వినతలను అందజేసినట్లు అధికారులు తెలిపారు.

ప్రజావాణిలో ప్రజలు విన్నవించుకున్న సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటున్నట్లు జెడ్సీ డి. శ్రీధర్ తెలిపారు. ముఖ్యంగా నీటిసమస్య పరిష్కారం పై దృష్టి పెట్టినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఇ.ఇ. వేణుగోపాల్‌రావు, ఏపిడి రజినికుమారి, టౌన్‌ప్లానింగ్ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ సూపర్ వైజర్ వి.కుమార్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## సత్య జీవ మార్గ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ




గాజువాక: జీవీయంసీ 58వ వార్డు వడ్లపూడి జంక్షన్ లో సత్య జీవ మార్గ చారిటబుల్ ట్రస్టీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారిపై ప్రయాణించే వాహనదారులకు, పాదచారులకు మజ్జిగను అందజేసి దాహాన్ని తీర్చారు. ఈ సంధర్బంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రతీ ఒక్కరూ ముందుండాలని అన్నారు. స్వార్థం విడనాడి పరోపకారానికి శ్రీకారం చుట్టాలని సూచించారు. తన సంపాదనలో ఎంతో కొంత ఇతరలకు ఉపయోగపడే కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా సమాజంలో మంచిగుర్తింపు వస్తుందని, మనశ్శాంతి కూడా లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు ట్రస్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రన్న కానుక పంపిణీలో జాప్యం

అనంతగిరి : మండలం లో కోండిబ డిపో సాప్ నెశీ,,139 లో చంద్రన్న కానుక సరుకులు పంపిణీ లో అవకతవకలు జరిగిందని రేషన్ కార్డు లబ్ధిదారులు కిలో గోవర్ధన్ బలరాం తదితరులు సోమవారం విలేకరులకు తెలిపారు .డిపో పరిధిలో 200 రేషన్ కార్డులు ఉన్నాయని ఒక్కొక్క రేషన్ కార్డుకి రెండు కెజిలేసి కందిపప్పు, రాగి పిండి ఇవ్వవలసి ఉండగా కుదించి ఒక కేజీ చొప్పున్న లబ్ధిదారులకు ఇచ్చారని రేషన్ కార్డు దారులు వారి ఆవేదన వ్యక్త పరిచారు తోటి గిరిజనుడైన డ్వాక్రా డీలర్ గిరిజనులకే ఇంతమోసామ్ చేశాడని వారు వపావుతున్నారు.సుమారుగా 2, కేజీలు కందిపప్పు,2, కేజీల రాగి పిండి కాజేసాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.అలాగే కాజేసిన మొత్తం వస్తువులను వెలకటితే సుమారుగా ఇరువది వేళారూపాయులు అవుతుందని అన్నారు నష్టపోయిన లబ్ది దారులకు జిసిసి అధికారులు సివిల్ సప్లయాధికారులు చొరతీసుకొని మిగిలిన కందిపప్పు, రాగిపిండి కేజీ చొప్పన్న ఇప్పించి డీలార్ పై కఠినచర్యలు తీసుకోవాలని రేషన్ కార్డు లబ్ది దారులు, స్థానికులు డిమాండ్ చేశారు.

## ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గొడవలు చేయరాదు



కాట్రేనికోన : సార్వత్రిక ఎన్నికల్లో ఫలితాలు వెలువడిన తర్వాత కాట్రేనికోన మండలం లో ప్రజలు గొడవలకు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడరాదని కాట్రేనికోన ఎస్సై సుభాకర్ తెలిపారు. సోమవారం కాట్రేనికోన ఎస్సై సుభాకర్ మొల్లేటిమొగ, కొత్తపాలెం గ్రామంలో పర్యటించి ప్రజలకు గొడవలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. ఎవరైనా క్రిమినల్ చర్యలక పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కేకేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అందరూ శాంతియుతంగా ఉండాలని అనవసరంగా గొడవలకు దిగి తమ భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు. ఈకార్యక్రమంలో కాట్రేనికోన పోలీసులు గ్రామంలో స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## మధురవాడ కే టు కాలనీ లో సమస్యలు వెల్లువ



మధురవాడ, మహా విశాఖ జోన్ వన్ జోనల్ కార్యాలయం లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో నాలుగు వినతులు అందాయి. ఇందులో ప్రధానంగా కొమ్మాది పరిసర ప్రాంతంలో ఉన్న కే టు కాలనీ లో నివసిస్తున్న రాజీవ్ గృహకల్ప వాసులు గత కొంత కాలంగా కాలనీ ప్రాంత ప్రజలకు నీరు లేక ఇబ్బంది పడుతున్నామని తెలియ పరిచేందుకు గాను సోమవారం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు అనంతరం జోనల్ కమిషనర్ పి దుర్గా ప్రసాద్ కి వినతి పత్రం అందించారు ముఖ్యంగా కె టు కాలనీలో ఏర్పాటుచేసిన పంపు హౌస్ నేటికీ అందుబాటులోకి రాక నిరుపయోగంగా పడి ఉన్నదని దాని వినియోగం నాకు తీసుకువచ్చినట్లయితే కాలనీవాసులకు త్రాగునీరు లభిస్తుందని కాలనీవాసులు అభిప్రాయం వ్యక్తం చేశారు, దీనిపై జోనల్ కమిషనర్ పి దుర్గా ప్రసాద్ స్పందిస్తూ కాలనీని పరిశీలించి తగుచర్యలు చేపడతామని హామీ ఇచ్చారు, ఈ కార్యక్రమంలో తాటిపూడి ప్రదీప్ కుమార్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## అభివృద్ధి, సంక్షేమం వల్లే విజయం సాధిస్తాం

తీవ్రంగా ఉంటాయి. అందుకే వీవీప్యాట్ స్లిప్పులపై నా డిమాండ్‌ను అందరూ ఒప్పుకొంటున్నారు. మాజీ సీఈసీ ఖురేషి కూడా నా అభిప్రాయాలను సమర్థించారు. వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించాలని 23 పార్టీలు ఈసీకి విజ్ఞప్తి చేశాయి. వీవీప్యాట్ స్లిప్పులను బాక్సులో వేసి లెక్కించేందుకు ఇబ్బంది ఏమిటి?. వీవీప్యాట్ స్లిప్పులు లెక్కించేందుకు ఎక్కువ సమయం అవసరం లేదని ఖురేషి చెప్పారు. పారదర్శక విధానంతో ఓటర్లలో విశ్వాసం కల్పించాలి.

తేడా వస్తే మొత్తం స్లిప్పులు లెక్కించాలి..

వీవీప్యాట్ స్లిప్‌ను ఓటరు చేతికి ఇవ్వాలి. ఓటరు సంతృప్తి చెందాక పక్కనున్న బాక్స్‌లో వేయాలి. ఈవీఎంలలోని ఓట్లు, వీవీప్యాట్ స్లిప్పుల బాధ్యతలను వేర్వేరు అధికారులు చూస్తున్నారు. 5 వీవీప్యాట్ల లెక్కింపులో తేడా వస్తే మొత్తం స్లిప్పులు లెక్కించాలి. కౌంటింగ్ ప్రక్రియలో ఇంకా చిన్నచిన్న సమస్యలు ఉన్నాయి. వాటిని ఈసీ పరిష్కరించాలి. ఈవీఎంలపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ప్రోగ్రామింగ్ చిప్ నియంత్రణ ద్వారా ఏదైనా చేయొచ్చు.

అందరం చర్చించిన తర్వాతనే..

ఎన్నికలు ఇలా జరుగుతాయని నేను ఊహించలేదు. ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు ముందు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీతో మాట్లాడి ఆ తర్వాత దిల్లీ వెళ్లాను. అందరం చర్చించిన తర్వాతే రాష్ట్రపతిని కలిసే విషయంపై నిర్ణయం తీసుకుంటాం అని చంద్రబాబు అన్నారు.

## లగడపాటి ఎగ్జిట్‌పోల్‌ను నమ్మి ఊహల్లో విహరిస్తున్నారు

23న తర్వాత తేడా వస్తే ఆయన్ను నిలదీసేట్టున్నారు. పార్టీ ఓడి, బెట్టింగుల్లో నష్టపోయినోళ్లు ఊరుకుంటారా? మాజీ ఎంపీవి కాబట్టి పోలీసు ప్రొటెక్షన్ అడగొచ్చు తప్పులేదు. బాబు, కిరసనాయిలు రేపటి నుంచి నీ ఫోన్లు కూడా ఎత్తరు. రాజగోపాల్ సర్వేలో ఆయన మెదడును ఆయన డీఎన్ఏ డామినేట్ చేసింది' అని విజయసాయిరెడ్డి ట్విట్ చేశారు.

ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నదేమిటో?

తెలుగు ప్రజల ఆత్మగౌరవం నినాదంతో పుట్టిన తెలుగుదేశం పార్టీని చంద్రబాబు నాయుడు సోనియా, ఉత్తరాది నేతల పాదాల ముందు పడేశారని విజయసాయిరెడ్డి విమర్శించారు. పొరుగున్న తెలంగాణ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ వినాశనాన్ని కోరుకుంటుందని బోరున విలపించిన చంద్రబాబు ఇప్పుడు చేస్తున్నదేమిటని ప్రశ్నించారు. ఎప్పుడు కలవాలో ఎప్పుడు విడిపోవాలో చంద్రబాబు కంటే వాళ్లకే ( ఉత్తరాది నేతలు, కాంగ్రెస్ నాయకులు) బాగా తెలుసని విజయసాయిరెడ్డి ట్విట్ చేశారు.

బాబును అందరూ 'ఫెవికాల్ బాబా' అంటున్నారట..

ప్రస్తుతం చంద్రబాబును ఢిల్లీలో అందరూ 'ఫెవికాల్ బాబా' అని పిలుస్తున్నారని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. పిలవని పేరంటంలా అందరి ఇళ్లపై పడి ఫొటోలు దిగుతూ, వాళ్లను, వీళ్లను కలుపుతా అంటూ చంద్రబాబు తిరుగుతున్నారని దుయ్యబట్టారు. ఇది చూసిన ఢిల్లీ నేతలు చంద్రబాబుకు ఈ మారుపేరు పెట్టారనీ, జోకులు వేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఈ నిక్ నేమ్ తగిలించారట. ఎవరి టెన్షన్లలో వాళ్లుంటే సమయం, సందర్భం లేకుండా ఈ ఫెవికాల్ రాయబారాలేమిటని జోకులేసుకుంటున్నారట' అని విజయసాయిరెడ్డి ట్విట్ చేశారు.

మరో ట్విట్‌లో 'యూపీఏ, మాయా-అఖిలేశ్ ఫ్రంటులు చతికల పడ్డాయి. చంద్రబాబు గ్రాఫ్ ఢమాల్ అన్న విషయం కూడా వాళ్లకి అర్థమైంది. లగడపాటి సర్వేను అందరికీ చూపించబోగా విసుక్కున్నారట. పాపం అటు ఇటు కాకుండా పోయాడు బాబు' అని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు.

సొంత రాష్ట్రంలో గెలవలేక ఢిల్లీలో తిరుగుతున్నారు

సొంత రాష్ట్రంలో గెలిచే సీన్ లేక సీఎం చంద్రబాబు నాయుడు ఢిల్లీ, లక్నోలో తిరుగుతున్నారని విజయసాయిరెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్డీయేతర పార్టీలు అస్థిత్వ సమస్యను ఎదుర్కొంటుంటే చంద్రబాబు ఐక్యత చర్చలంటూ తిరుగుతున్నారని విమర్శించారు.' ఏడో దశ ఎన్నికల్లో తీరిక లేకుండా ఉంటే చంద్రబాబు వెళ్లి మాయా, అఖిలేశ్, రాహుల్, పవార్లను ఫొటో సెషన్ల కోసం హింస పెడుతున్నాడట. సొంత రాష్ట్రంలో గెలిచే సీన్ లేక ఢిల్లీ, లక్నోలలో తిరుగుతున్నాడు. ఎన్డీఏ యేతర పార్టీలు అస్థిత్వ సమస్యను ఎదుర్కొంటుంటే ఐక్యత చర్చలంట' అని విజయసాయిరెడ్డి ట్విట్ చేశారు.

## సినీ నటుడు రాళ్లపల్లికి కన్నీటి వీడ్కోలు

అంతిమ యాత్ర రాయదుర్గం మహాప్రస్థానానికి చేరుకుంది. అనంతరం ఆయన పార్థివ దేహాన్ని స్మశాన వాటికకు తీసుకొని వచ్చి విద్యుత్ దహన వాటికలో కుటుంబ సభ్యులు అంత్యక్రియలు చేపట్టారు. అంతిమ యాత్రలో సినీ ప్రముఖులు రాజశేఖర్, జీవిత దంపతులు, కోట శ్రీనివాసరావు, భరద్వాజ, తనికెళ్ళ భరణి, బాబూ మోహన్, శివాజీ రాజాతో పాటు ఆయన అభిమానులు పాల్గొన్నారు.

## ఇ-ఆఫీసు అమలులో అధికారులు వేగవంతం కావాలి

తిప్పుకోవడము సరికాదన్నారు. మీ కోసం క్రింద వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో తగు పరిశీలన చేసి పరిష్కరించి దరఖాస్తుదారునితో ఫొటో తీసుకుని అప్ లోడ్ గావించాలన్నారు. అధికారుల క్షేత్రస్తాయి పరిశీలనల కోసం ఒక యాప్‌ను తయారు గావించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు తాగునీటికి యిబ్బంది పడుతున్నారని, ఈ విషయమై సూపరింటెండెంట్ ఇంజనీర్, రూరల్ వాటర్ సప్లై స్పందించి తాగు నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఇ-ఆఫీసు అమలులో అధికారులు వేగవంతం కావాలన్నారు.

## దుస్సాహసానికి పాల్పడితే గట్టిగా బదులిస్తాం

కొనసాగించే ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దుల్లో చొరబాట్లు, కాల్పుల విరమణ ఉల్లంఘనలు, డ్రగ్స్ అక్రమ రవాణ, నకిలీ కరెన్సీ చలామణి వంటి చర్యలకు పాల్పడుతోంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌తో పాటు పాక్‌లో ఉగ్ర కార్యకలాపాలు జరుగుతున్నాయి అని పేర్కొన్నారు.

## ఆర్టీసి కార్మికుల ధర్నా



నర్సీపట్నం : డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎన్ఎంయు ఆధ్వర్యంలో సోమవారం నర్సీపట్నం ఆర్టీసి డిపో గేటు ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి జివిఎస్.నారాయణ మాట్లాడుతూ రవాణాశాఖా మంత్రి సమక్షంలో యూనియన్లతో జరిగిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ఇచ్చిన సమ్మె నోటీసుకు మద్దతుగా అన్ని డిపోల్లో రెండు రోజుల పాటు గేటు ధర్నాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రధానంగా సంస్థ ఎండి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సమక్షంలో యూనియన్లతో జరిపిన ఒప్పందాలను విలువ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. 40శాతం ఏరియర్స్ తక్షణమే చెల్లించాలన్నార.ఖర్చు ఆదా సిబ్బంది తగ్గింపు అద్దె బస్సుల పెంపు, గ్యారేజీ కార్మికులపై అధిక ఒత్తిడితో కూడిన పని భారం మొదలైన చర్యలను వెంటనే నిలుపుదల చేయాలన్నారు. లేని పక్షంలో సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు మోటారు వెహికల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలన్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు సంవత్సరానికి రూ.1000 కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. ఆర్టీసికి డీజిల్‌పై ప్రభుత్వాలు అమ్మకం పన్నులు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి కార్మికులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువుల తయారీపై శిక్షణ

నర్సీపట్నం : నర్సీపట్నం కాపువీధి రామాలయం వద్ద సోమవారం మున్సిపల్ కమిషనర్ పి.రవిబాబు ఆధ్వర్యంలో సంకల్ప సేవా సొసైటీ సభ్యులకు, డ్వాక్రా మహిళలకు సేంద్రియ ఎరువు తయారు చేసుకునే విధానం పై సంకల్ప సొసైటీ విసి కృష్ణ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కృష్ణ ఇంటి దగ్గర ఉన్నటువంటి తడి చెత్తను వేరుగా చేసి దానిని ఎరువు ఎలా తయారు చేస్తారు, ఇంటి వద్ద పూల మొక్కలకు ఈ ఎరువులు ఎలా వాడుకోవడానికి తెలియజేశారు.

అనంతరం మున్సిపల్ కమిషనర్ రవిబాబు మాట్లాడుతూ చెత్త నుండి సంపద తయారు చేయవచ్చున్నారు. ప్రతి ఒక్కరు కూడా తమ ఇంటి వద్ద తడి పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి తడి చెత్తను ప్రతి ఒక్కరు ఇంటి వద్ద కంపోస్ట్ తయారు చేసుకుని మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ప్రతి ఒక్కరు ఎరువుగా తయారు చేసుకోవడం వల్ల ఇంటి వద్ద మంచి కూరగాయలు పండించుకోవచ్చునన్నారు. కావున ప్రతీ ఒక్కరూ ఎరువుల తయారీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంకల్ప సొసైటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# గెడ్డపై అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలుపుదల చేయాలి

## లేకుంటే ప్రజాపోరాటం చేస్తాం ..సీపీఐ(యం) డిమాండ్



విశాఖ సిటీః 34 వ వార్డులోని నరసింహనగర్, పోర్టు క్వార్టర్స్ మధ్య నేషనల్ హైవే సమీపంలో ఉన్న గెడ్డ పై అక్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ అక్కయ్యపాలెం సీపీయం పార్టీ జోన్ కమిటీ నాయకులు సోమవారం జీవీయంసీ కమీషనర్‌ని, విశాఖ అర్బన్ యంఆర్‌ఓని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవీయంసీ కమీషనర్, అర్బన్ యంఆర్ఓ మాట్లాడుతూ గెడ్డ ఆక్రమణ సమస్య తమ దృష్టికి వచ్చిందని, దీనిపై సంబంధిత అధికారులతో చర్చించి, విచారణ జరిపించి వెంటనే తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అనంతరం అక్కయ్యపాలెం సీపీయం పార్టీ జోన్ కన్వీనర్ యం. ప్రదీప్ కుమార్, జోన్ కమిటీ నాయకులు బి.యల్.నారాయణ. ఆర్.యన్.మాధవి, బి.లక్ష్మీపతి మాట్లాడుతూ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న గెడ్డ పోరంబోకు స్థలాన్ని ఆక్రమించి 150 గజాల స్థలంలో బహుళ అంతస్తుల భవన నిర్మాణం జరుగుతోందని, ఈ అక్రమ నిర్మాణం ప్రక్కనే మరో 500 గజాల స్థలాన్ని మరో పెద్ద మనిషి ఆక్రమించి భవన నిర్మాణం చేపట్టే సాహసం చేస్తున్నారని, జాతీయ రహదారికి అతిసమీపంలో ఉన్న ఈ అక్రమ కట్టడాన్ని జీవీయంసీ అధికారులు ఇప్పటివరకు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిలువనీడలేని నిరుపేదలు ఊరికి దూరంగా కొండవాలు ప్రాంతాలలో 60 గజాలలో పాకలు వేసుకుంటే వారిని భయభ్రాంతులకు గురిచేసి బుల్‌డోజర్లతో తొలగిస్తున్న అధికారులు నగర నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువచేసే ఈ ఆక్రమణలపై చోద్యం చూస్తూ, ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని, దాని వెనుక పలుకుబడి కలిగిన రాజకీయ నాయకుల హస్తం తప్పక ఉంటున్నదని, వీరికి అధికారులు వంతపాడుతున్నారని అన్నారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని,ఈ అక్రమ నిర్మాణ నేల కూల్చి, ఆగెడ్డ స్థలాన్ని కాపాడాలని ప్రార్థిస్తున్నాము. లేనియెడల ప్రజానీకాన్ని సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# కార్పొరేట్ విద్యా సంస్థల్లో గ్రంథాలయాలు ఉండాలి

## కొణతాల రఘునాథ్ ప్రభుత్వానికి సూచన



అనకాపల్లి : ప్రభుత్వ పర్యవేక్షణలో కార్పొరేట్ విద్యా సంస్థల్లో గ్రంథాలయాలు తప్పనిసరిగా ఉండాలని శ్రీ ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ పేర్కొన్నారు. గ్రంథాలయం అంటే బీరువాలు, కుర్చీలు కాదని, వీటిని ప్రభుత్వమే నిర్వహించిదే మంచిదని వ్యక్తం చేశారు. శ్రీ గౌరీ గ్రంథాలయంలో జరుగుతున్న కంప్యూటర్ శిక్షణ తరగతులను సోమవారం సందదర్శించిన ఆయన విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. యువతలో నైరాశ్యం పారద్రోలేందుకు వృత్తి నైపుణ్యత, జీవితంలో స్థిరపడేందుకు దోహదపడు విజ్ఞాన, విద్య అంశాలపై గ్రంథాలయం తరుచూ సదస్సులు నిర్వహించాలన్నారు. ఆన్‌లైన్ ఎంత అభివృద్ధి చెందినా, పుస్తకం మాత్రం మెయిన్‌లైన్‌లోనే ఉందని అభిప్రాయ పడ్డారు. గ్రంథాలయాలంటే మౌనముద్రలో ఉన్న పాఠక లోకం పాలిట ప్రగాఢ భావ వ్యక్తీకరణ సాధనాలని కొణతాల రఘునాథ్ పేర్కొన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ భవిష్యత్ లో స్వతంత్రంగా యువత శాశ్వత ఉపాధి కల్పన అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్యదర్శి మళ్ల బాపు నాయుడు, సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, కర్రి హనుమంతరావు, శిక్షకులు డి.పూర్ణిమ, చదరం రామచంద్రం పాల్గొన్నారు.

# సెయింట్ మేరీస్ విద్యార్థుల ప్రతిభ



విశాఖ సిటీః అక్కయ్యపాలెంలోగల సెయింట్ మేరీస్ హైస్కూల్ విద్యార్థులైన కె. వసుత 10కి 10, ఎస్. భవాని 10కి 10, కె. యోగేంద్ర 10కి 10 పాయింట్లు సాధించారు. 9.8 మార్కులు సాధించిన వారు ఒక్కరు, 9.7 (ఇద్దరు), 9.5 (నలుగురు), 9.3 (నలుగురు), 9.2 (ఒక్కరు), 9.0 (ఐదుగురు)గా 10 పరీక్షల్లో విజయం సాధించారు. స్కూలు ప్రిన్సిపాల్ బి. నరసింగరావు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ నాగేశ్వరరావు పాల్గొని విద్యార్థినీ విద్యార్థులు ఇన్ని మంచి ర్యాంకులు సాధించినందుకు వారికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందించారు. వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయల కృషికి మెచ్చుకున్నారు.

# 21న విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

నర్సీపట్నంః విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక పెదబడ్డేపల్లి డివిజన్ కార్యాలయంలో ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఫోరమ్ చైర్ పర్సన్ ఆదేశాల మేరకు పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఉంటుందన్నారు. వినియోగదారుల పరిష్కార వేదికలో ఫోరమ్ చైర్ పర్సన్ దుంపల ధర్మరావు, ఫోరమ్ సభ్యులు కె.బాలాజీ, పి.వి.రమణరావు, పి.బాలాజీ పాల్గంటారని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం, మీటరు, బిల్లు సమస్యలు, విద్యుత్ సరఫరా సంబంధించి ఇతర సమస్యలు పరిష్కార వేదిక దృష్టికి తీసుకు రావచ్చునన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# బిల్లులు చెల్లింపులపై దర్యాప్తు చేయండి

గొలుగొండః మరుగుదొడ్ల నిర్మాణాలు వాటికి సంబంధించిన బిల్లుల చెల్లింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు జక్కు నర్సింహమూర్తి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇప్పటికీ చెల్లింపులు జరగక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంపిడిఒల ఖాతా నుంచి నేరుగా లబ్ధిదారుల ఖాతాలోకి వెళ్లాల్సిన నిధులు మరొకరి ఖాతాల్లోకి మళ్లించడాన్ని ఆయన తప్పుబట్టారు. వీటిపై ఇప్పటికే చాలా మండలాల్లో సామాజిక తనిఖీలు నిర్వహించి నిధులు దుర్వినియోగమైన అంశాలను జిల్లా అధికారులకు అందించినట్టు పేర్కొన్నారు. అధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టి లబ్ధిదారులకు చెల్లింపులు చేయాలని కోరారు.

# పల్లెల్లో తొలకరి పనులు ప్రారంభం



నాతవరంః అడపా దడపా వర్షాలు కురుస్తుండటంతో నాతవరం మండలంలోని వివిధ గ్రామాల్లో తొలకరి వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి. పదును ఆరకముందే రైతులు నాగలి, ట్రాక్టర్‌తో దుక్కుదున్ని నువ్వు విత్తనాలు జల్లుతున్నారు. మరికొంత మంది రైతులు సేంద్రీయ ఎరువులను ఎండ్ల బండ్ల ద్వారా తీసుకువెళ్లి పొలాల్లో వేస్తున్నారు. ఈ ఏడాది వర్షాలు కలిసి వస్తే నువ్వు పంట ఆశాజనకంగా ఉంటుందని ఆశిస్తున్నారు. అలాగే వేసవిలో పొలం దుక్కు దున్నడం వల్ల నేల గుల్లబారి ఏ పంట వేసినా మున్ముందు మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని కొందరు రైతులు చెబుతున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దు

## కొత్తకోట సిఐ లక్ష్మణమూర్తి

రావికమతంః సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈ నెల 23న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏ ఒక్కరూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడరాదని కొత్తకోట సిఐ లక్ష్మణమూర్తి తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు.

ఫలితాలపై బెట్టింగ్‌లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఒక్క పార్టీ వారైనా ప్రజలను రెచ్చగొట్టేలా నినాదాలు చేసినా, ర్యాలీలు నిర్వహించినా, బాణసంచా పేల్చినా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ నెల 27వ తేదీ వరకు కోడ్ అమల్లో ఉంటుందని చెప్పారు. ఈ విషయాన్ని ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు గుర్తించుకోవాలన్నారు. పోలీసులు గ్రామంలోనే ఉంచారని అన్నారు.

ఎక్కడైనా అవాంఛనీయ పరిస్థితులు గమనిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించాలి



నాతవరంః మండలం ఎం.బెన్నవరం ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎం.బెన్నవరం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం దళితులు నాతవరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని జనవరి 2న జరిగిన జన్మభూమిలో అధికారులకు కోరామన్నారు. దళితుల పట్ల ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లు, పంచాయతీ సెక్రటరీ, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి బాధ్యతారాహిత్యం, నిధుల దుర్వినియోగంపై అప్పట్లో జిల్లా కలెక్టర్‌కు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి 1100కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. గత ఎంపిడిఒ యాదగిరీశ్వరరావు 2018 నవంబర్ 26న ఆర్‌ఐటి చట్టం కింద మంచినీటి సమస్యపై తీసుకున్న చర్యలు గురించి తెలపాలని దరఖాస్తు చేయగా కనీస బాధ్యతతో సమాచారమివ్వలేదన్నారు. ఎంతకాలం వివక్షత చూపుతారన్నారు. కనీసం దళితులకు మంచినీరు ఏర్పాటు చేయలేని చేత కాని ప్రభుత్వ అధికారులపై దళితులు ధ్వజమెత్తారు. 24 గంటల్లో మంచినీటి సమస్యలను తీర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.బెన్నవరం అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామ దళితులు పాల్గొన్నారు.

# గెలుపు గుర్రాలపై సర్వత్రా చర్చ

రోలుగుంటః మండలంలో ఎక్కడ చేసినా సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపైనే చర్చలు జరుగుతున్నాయి. ఏ ముగ్గురు కలిసినా ఇదే విషయమై మాట్లాడుతున్నారు. ఈ నెల 23న ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో ఆ ఫలితాల్లో గెలుపు గుర్రాలు ఎవరన్న దానిపై చర్చించుకుంటున్నారు. ఇప్పటికే గ్రామాల్లో టీడీపీ, వైసిపి విజయాలపై జోరుగా బెట్టింగులు జరిగాయి. ఓటింగ్ ముగిసిన వెంటనే విజయాలపై గ్రామాల్లో చిన్నపాటి నాయకులు 1000 నుంచి రూ.1లక్ష వరకు బెట్టింగ్‌లు వేశారు.

## కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు

కొయ్యూరుః గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఎంపిసి, బైపిసి, సీఈసి, హెచ్‌ఈసి, ఎంఈసి గ్రూపుల్లో ప్రవేపశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యరాజులు చెప్పారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ నెల 27లోగా గురుకుల కళాశాలలో సంప్రదించి దరఖాస్తులు అందజేయవచ్చునన్నారు. 30వ తేదీని కౌన్సిలింగ్ జరుగుతుందని పేర్కొన్నారు.

# భారీగా గుట్కా ప్యాకెట్లు స్వాదీనం



నర్సీపట్నంః నర్సీపట్నం కోమటివీధిలో రూ.30వేల విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాదీనం చేసుకున్నామని నర్సీపట్నం టౌన్ సిఐ సిహెచ్.లక్ష్మణరావు తెలిపారు. ముందస్తు సమాచారం పై కోమటివీధిలోని హమీద్ అనే వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేయగా ఈ గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. వీటిని స్వాదీనం చేసుకొని ఒక వ్యక్తిని అదుపులో తీసుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా ఎస్సై శకుంతల, సిబ్బంది ఉన్నారు.

# పాత్రికేయుల సంక్షేమం ప్రభుత్వాలదే

- మృతిచెందిన జర్నలిస్టులకు ప్రభుత్వ సాయం అందించాలి
- సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణకు ఘననివాళి



విశాఖపట్నం : సమాజభివృద్ధి కోసం నిరంతరం సేవలు అందిస్తున్న పాత్రికేయుల సంక్షేమం చూడవల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి, వైజాగ్ జర్నలిస్టుల ఫోరమ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అన్నారు. పత్రికా రంగంలో సుదీర్ఘకాలం పాటు సేవలందించి ఇటీవలే అనారోగ్యం కారణంగా మృతిచెందిన సీనియర్ పాత్రికేయులు మేకల సత్యనారాయణ సంతాప సభను సోమవారం ఇక్కడ కాకానినగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పలువురు జర్నలిస్టులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో సత్యనారాయణ అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేశారని కొనియాడారు. సింహాచలం దేవస్థానం భూముల పరిరక్షణ, ఆలయ అభివృద్ధితో పాటు, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాల పట్ల కూడా సత్యనారాయణ అనేక కథనాలు వ్రాసి వెలుగులోకి తీసుకువచ్చారన్నారు. సమాజం కోసం పాటుపడుతున్న జర్నలిస్టులు మృతిచెందితే వారికి తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం అందించాలన్నారు. ఇదే సమయంలో ఆయా కుటుంబాలకు పాత్రికేయులు, పాత్రికేయ సహచరులు అండగా వుంటామన్నారు. ప్రస్తుతం హెల్త్ ఇన్సూరెన్సు, ప్రమాద భీమా పాలసీ పాలసీ కార్డులు సక్రమంగా పనిచేయకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సింహాచలం, గోపాలపట్నం, వేపగుంట, పెందుర్తి, ఎన్.ఎ.డితో పాటు జిల్లా నలుమూలలా నుంచి పెద్దఎత్తున జర్నలిస్టులు సత్యనారాయణకు నివాలర్పించారు. ఈ కార్యక్రమంలో 42వ వార్డు మాజీ కార్పొరేటర్ జియ్యాని శ్రీధర్, స్థానిక నేతలు సొడదాసు సుధాకర్, డెంకాడ ఆనంద్, సీనియర్ జర్నలిస్టులు మల్లు రాజేష్, సత్యానంద్, హిందూ రమణతో పాటు పలువురు హాజరయ్యారు.

# విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల చారిత్రాత్మక ఒప్పందం




విశాఖపట్నంః గుర్తింపు సంఘం స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) మరియు స్టీల్ ప్లాంట్ యాజమాన్యం మధ్య స్థానిక అంశాలపై తేది:11-5-19న చారిత్రాత్మిక ఒప్పందం జరిగింది. గత సంవత్సర కాలం నుంచి వివిధ రూపాల్లో పోరాటాలు జరిగాయి. మార్చి 6వ తేదీన జరిగిన 24 గంటల ధర్నాలో వేలాది మంది కార్మికులు పాల్గొన్నారు. కార్మికుల పోరాట ఫలితమే ఈ చారిత్రాత్మిక ఒప్పందం. ఒప్పందం చేసిన యాజమాన్యానికి ధన్యవాదాలు.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇంత వరకు పెన్షన్ స్కీం లేదు. ఈ ఒప్పందం ద్వారా స్టీల్‌ప్లాంట్‌లో పెన్షన్ స్కీం అమలౌతుంది. 2012 నుంచి యాజమాన్యం తరపున కార్మికుల బేసిక్‌పై 6శాతం పెన్షన్స్ కోసం చెల్లిస్తారు. అప్పటి నుంచి కార్మికులకు రూ.600/- కోట్లు పెన్షన్ స్కీంలో చేరతాయి. సిఐటియు ఆధ్వర్యంలో 1995లో సూపర్ యాన్యూవేషన్ బెనిఫిట్ స్కీంపై ఒప్పందం చేసింది. ఈ స్కీంలో యాజమాన్యం వాటా డబ్బులు రూ.650/- కోట్లు పెన్షన్ స్కీంలో కలుపుతారు. ఈ మొత్తాన్ని కార్మికుల సర్వీస్‌ను బట్టి వారి రిటైర్మెంట్ తరువాత పెన్షన్‌గా చెల్లించబడుతుంది. దేశంలో ఒకవైపున కేంద్ర ప్రభుత్వం 2004 నుంచి ఉన్న పెన్షన్ స్కీములను తీసివేసి నూతన పెన్షన్ స్కీమ్ పేరుతో కార్మికులకు తీవ్ర అన్యాయం చేసింది. కాని ఇదే సమయంలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో మంచి పెన్షన్ స్కీంను సాధించడం సిఐటియు ఘనవిజయం. సిఐటియు గతంలో చేసిన ఫ్యామిలీ బెనిఫిట్ స్కీం వల్ల కార్మికులు ఉద్యోగంలో వుండగా మరణిస్తే కార్మికునిపై ఆధారపడిన కుటుంబానికి కార్మికుని సర్వీస్ కాలమంతా బేసిక్ మరియు డిఎ చెల్లించబడుతుంది. ఈ ఒప్పందం కూడా 1995లో సిఐటియు గుర్తింపులో వుండగా జరిగింది.

కార్మికుల ప్రమోషన్ విషయంలో ఎస్-3, ఎస్-7, ఎస్-10 గ్రేడ్ కార్మికులకు ఒక సంవత్సరం ముందుగానే ప్రమోషన్ పొందుతారు. దీనివల్ల వేలాది మంది కార్మికులకు ప్రమోషన్ ముందుగా పొందే సౌకర్యం లభించింది. ట్రైనింగ్ పొంది కొత్తగా ఉద్యోగంలో చేరిన కార్మికుల తల్లిదండ్రులకు వైద్య సౌకర్యాన్ని కల్పించే విధంగా ఒప్పందం జరిగింది. అగనంపూడి బార్క్ క్యాన్సర్ ఆసుపత్రి మరియు విశాఖ స్టీల్ యాజమాన్యం మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పిస్తారు. కన్సల్‌టేషన్ ఫీజు పెంపు, ల్యాబ్ సౌకర్యాలు మరియు ఇతర వైద్య విషయాలపై చర్చలు కొనసాగుతున్నాయి. పండగ అడ్వాన్సును రూ.5వేల నుంచి 12వేలకు పెంచడానికి యాజమాన్యం అంగీకరించింది. స్టీల్‌ప్లాంట్‌లో పనిచేస్తున్న మాజీ సైనిక ఉద్యోగులకు క్వార్టర్స్ కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వబడింది. రాత్రిపూట క్యాంటిన్‌లో అదనపు సౌకర్యాలు కల్పించబడతాయి.

విశాఖపట్నంలో భారీ స్టీల్‌ప్లాంట్ వున్నా విశాఖ ప్రజలకు స్టీల్ అమ్మకాలు నేరుగా ఇప్పటి వరకు అందుబాటులో లేవు. హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీ సిరిపురంలో పెట్రోలియం ఔట్‌లెట్ ఏర్పాటు చేసింది. స్టీల్‌ఔట్‌లెట్లు ఏర్పాటు చేసి డీలర్‌తో నిమిత్తం లేకుండా నేరుగా స్టీల్ అమ్మకాలు జరగాలని సిఐటియు గత సంవత్సరకాలం నుంచి చేసిన ఒత్తిడికి యాజామాన్యం అంగీకరించింది. బాలచెరువు రోడ్డులో ఒక ఔట్‌లెట్‌ను, సిటీలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒక ఔట్‌లెట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు కోసం స్టీల్ యాజమాన్యం దరఖాస్తు చేశామని తెలియజేశామని తెలియజేసింది. వీలైనంత త్వరగా దీనిని అమలు చేయాలని కోరుతున్నాం.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేనందువల్ల ఇతర స్టీల్‌ప్లాంట్‌ల కంటే సంవత్సరానికి రూ.2200/-కోట్లు అదనంగా ఇనుప ఖనిజం కోసం చెల్లిస్తున్నాం. విశాఖ స్టీల్ ఈ భారాన్ని కొనసాగిస్తే నష్టాల ఊబిలో కూరుకుపోతాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు వెంటనే సమకూర్చాలని సిఐటియు కోరుతున్నది. దీని కోసం రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఉద్యమానికైనా సిద్ధపడాలని విన్నవిస్తున్నాం.




## మట్టిలో మాణిక్యంకి ప్రతిభా పురస్కారం: మాస్టర్ మైండ్ విద్యా సంస్థ



ములగాడ: ఇటీవలే విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 10/10 మార్కులు సాధించిన విద్యార్థులకు గాజువాక మాస్టర్ మైండ్ విద్యాసంస్థ యాజమాన్యం విద్యార్థులకు ప్రతిభ పురస్కారం అవార్డులను అందించారు ఇందులో భాగంగా విజ్ఞాన్ టాలెంట్ స్కూల్లో చదువుతున్న మల్కాపురం గొల్లవీధికి చెందిన ప్రముఖ జర్నలిస్టు గోవిందరాజు కుమార్తె లోడగల మౌనిక మాస్టర్ మైండ్ విద్యాసంస్థ మౌనికకు శాలువా కప్పి ప్రతిభా పురస్కారం అందించారు అనంతరం మౌనిక మాట్లాడుతూ ప్రతిభా పురస్కారం అందించిన విద్యా సంస్థ మాస్టర్ మైండ్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలుపుతూ తూ నా విజయం వెనక ఉపాధ్యాయులు కృషితో మాతల్లితండ్రుల పట్టుదలతో ఈరోజు 10/10 మార్కులు సాధించానని ఇంకా ఉన్నత చదువుల్లో ముందు ముందు ఇంకా ఎన్నో ర్యాంకులు సాధిస్తానని ఇదేవిధంగా నేను డాక్టర్ చదివి ప్రజలకు సేవ చేయడమే నా ముఖ్య లక్ష్యం ఆమె అన్నారు అనంతరం మౌనిక కు పలువురు స్కూలు యాజమాన్యం అభినందనలు తెలిపారు.

## దగ్ధమైన అంగన్వాడీ కేంద్రం పరిశీలన


కొయ్యూరు : పిడుగుపాటుకు మాలమాకవరం పంచాయతీ శివారు పనసలపాడు అంగన్వాడీ కేంద్రం పూరిల్లు దగ్ధమైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో అంగన్వాడీ కేంద్రంలో ఉన్న ఫర్నీచర్, ఆట వస్తువులు, పౌష్టికాహార సామగ్రి కాలిపోయాయి. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ భాస్కర్, సిడిపిఒ గౌతమి దగ్ధమైన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ భాస్కర్ మాట్లాడుతూ పనసలపాడులో నూతనంగా అంగన్వాడీ కేంద్రం మంజూరైందన్నారు. దీన్ని త్వరలో నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ అరుణ, సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు, జనసేన నాయకులు వారా సూర్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి సతీమణి సొంత ఖర్చులతో డ్రైన్లు, రోడ్డు లెవెల్ పనులు



నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటి 1వ వార్డు ప్రజలు వినతిపై స్పందించిన మంత్రి అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి తన సొంత ఖర్చులతో స్థానిక నాయకుల సహకారంతో పేరుకుపోయిన డ్రెయిన్లు, రోడ్లు లెవెల్స్ పనులు చేయించారు. ఇక్కడి ప్రజలు గత కొంతకాలం నుండి ఈ సమస్యపై అధికారులకు తెలియజేసినా స్పందించకపోవడంతో ఈ సమస్యను స్థానిక నాయకులు పద్మావతి దృష్టికి తీసుకువెళ్లగా ఆమె వెంటనే స్పందించి ఈ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో సోమవారం ఈ పనులు ముమ్మరంగా జరిగాయి. ఈ సమస్యను తీర్చిన పద్మావతికి, స్థానిక నాయకులకు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాబా శ్రీను, లాలం మురళీ, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

## డిప్లమా విద్యార్థి మృతి
### కన్నీరు మున్నీరైనా కుటుంబ సభ్యులు



ములగాడ: శ్రీహరి పురం 47 వ వార్డు బర్మాకాలనీకి చెందిన భరత్ అనే డిప్లొమా చదువుతున్న విద్యార్థి ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపింది ఒక ప్రైవేట్ కళశాలలో డిప్లొమా మెకానికల్ చదువుతున్న మృతుడు భరత్ నిన్న వెలువడిన డిప్లొమా ఫలితాలలో సబ్జెక్ట్ ఫెయిల్ అవ్వడంతో తల్లి మందలించింది అయితే ఈ మధ్య కాలంలో తండ్రి ఆరోగ్య పరిస్థితి బాగోకపోవడంతో తండ్రి ఇంటి వద్ద ఉంటున్నాడు ఈ నేపాధ్యంలో తల్లి కొడుకుని మందలించడంతో క్షణికావేశంలో భరత్ ఆత్మహత్య చేసుకున్నాడు సంఘటనా స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి మృతుడు రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో లభించింది కేసు నమోదు చేశామని మల్కాపురం సీఐ లంక భాస్కర్ రావు అన్నారు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్ తరలించారు తెలంగాణలో ఇంటర్ విద్యర్థుల ఆత్మహత్య మరవక ముందే ఆంధ్రాలో డిప్లొమా విద్యర్థీ ఆత్మహత్య కాస్తా పారిశ్రామిక ప్రాంతీంలో కలకలరేపింది...

## ప్రతి ఇంటిని దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచండి
### - కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం : ప్రతి ఇంటిని దోమలు లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా మూడవ జోన్‌కు చెందిన 24వ వార్డు కంచరవీధి, బుక్కవీధి, 25వ వార్డు చిలకపేటలలో మలేరియా వ్యాధిగ్రస్తులను సోమవారం సందర్శించి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేసివ్ సర్వయిలెన్స్‌తోబాటు ఏక్టివ్ సర్వయిలెన్స్ నిర్వహించి దోమల ఉత్పత్తి, వ్యాప్తి లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వర పీడితులకు రక్త పరీక్షలు నిర్వహించి పూర్తి చికిత్స అందించాలని ఆదేశించారు. వార్డులలో, ఇంటి పరిసరాలు, ఇంటివద్ద అధికారులు, స్పెషల్ ఆపీసర్స్ పారిశుధ్యం దోమకారక వ్యాధుల నివారణ లక్ష్యంగా విధులు నిర్వర్తించాలని కోరారు.

ముందస్తు జాగ్రత్తగా దోమకారక వ్యాధులైన జ్వరాల నివారణకు ఏప్రిల్ నుండే కార్యాచరణఅమలుచేశారని, మే 11, 12 తేదీలలో నగరంలోని ప్రతి ఇంటిని ప్రత్యేక సర్వయిలెన్స్ నిర్వహించినప్పటికి జ్వరాలు రావడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికా రులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రజారోగ్యం, మలేరియా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో చర్యలు తీసుకోవడంతో బాటు ప్రతి గృహ యజమాని వారి ఇంటిని, ఇంటి పరిసరాలను, దోమలు వ్యాప్తికి, ఉత్పత్తికి అవకాశం ఉన్న ప్రదేశాలను మరింత పరిశుభ్రం చేసుకొని ప్రతి ఇంటిలో పరిశుభ్రం ప్రతిబింబించేలా చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా జ్వర పీడితులను పరామర్శించి అన్ని జాగ్రత్తలు, పూర్తి చికిత్స తీసుకోవాలని కోరారు. పర్యటనలో బయాలజిస్ట్ పైడిరాజు, జోనల్ కమిషనర్ చిట్టిబాబు, ఏ.యం.ఓ.హెచ్ డా.సుధాకర్, మలేరియా, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## జివిఎంసి గ్రీవెన్సుకు 94 పిర్యాదులు

విశాఖపట్నం : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 94 ఫిర్యాదులు అందాయి. జివియంసి కమిషనర్ హరినారాయణన్ ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 94 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబం ధించి 32 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 4, నాలుగవ జోన్‌కు సంబంధించి 6, ఐదవ జోన్‌కు సంబంధించి 45, ఆరవ జోన్‌కు సంబంధించి 6, భీమిలి జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 23, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 7, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 22, హార్టికల్చర్ విభాగంకు సంబంధించి ఒకటి, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 13, యుసిడి విభాగానికి సంబంధించి 3, ఇతరులకు సంబంధించి 25 పిర్యాదులు అందాయి.

## డయల్ యువర్ కమిషనర్‌కు 12 ఫిర్యాదులు

విశాఖపట్నం :- జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 12 ఫిర్యాదులు అందాయి.

జె.డి అమృత్ సత్యనారాయణ డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి రెండు, మూడవ జోన్‌కు సంబంధించి నాలుగు, నాలుగవ జోన్‌కు సంబంధించి రెండు, ఆరవ జోన్‌కు సంబంధించి నాలుగు ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

## గ్లోబల్ స్కూలుని ప్రారంభించిన జెడి



మధురవాడ : మహా విశాఖ 5 వ వార్డ్ పరిధి అయోధ్య నగర్ లో నూతంగా ఏర్పాటు చేసిన ది గ్లోబల్ పబ్లిక్ స్కూల్ ని విశాఖ జనసేన పార్లమెంటరీ అభ్యర్థి వివి లక్ష్మీ నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ విద్యార్థులను చదువులతో పాటు మానసికంగా దృడంగా తయారు చేయాలని ఆయన స్కూల్ యాజమాన్యానికి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ బి.వెంకటరావు, బి.అనురాధ, ప్రిన్సిపాల్ బి.జయజ్యోతి, సిబ్బంది మరియు స్థానిక జనసేన నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల్లో అక్రమణులను తొలిగిస్తాం



మధురవాడ, మహా విశాఖ ఐదో వార్డ్ పరిధిలో గల మానం ఆంజనేయులు కాలనీ సమీపంలో ఉన్న 126 / 2 లో వి ఎం ఆర్ డి ఎ కు చెందిన సుమారు రెండెకరాల స్థలాన్ని ఖాళీ చేయించేందుకు అధికారులు పూనుకున్నారు, ఇటీవల రెవెన్యూ అధికారులు ఆక్రమణలు తొలగించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన మళ్లీ అదే స్థలాన్ని కబ్జా చేసేందుకు పూనుకొన్న విషయాన్ని రెవెన్యూ అధికారులు వి ఎం ఆర్ డి ఏ అధికారులకు సమాచారం అందించడంతో వుడా సర్వేర్ పైడిరాజు తన బృందంతో సోమవారం కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు, ఆక్రమణదారులు తక్షణం ఖాళీ చేయాలని ఆదేశించారు వారు ససేమిరా అనడంతో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించారు.

## రామాలయంలో వరుణయాగం

విజయనగరం: స్థానిక కొత్తపేట రామాలయంలో సోమవారం భగవద్రామాను.శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో కరుణయాగం నిర్వహించారు. లోకకళ్యాణార్థంవర్షాలు కురిసి దేశం సస్యశ్యామలం కావాలని కోరుతూ ఋత్విక్కులు శ్రీమన్నారాయణ, పీసపాటి రామావతారం, ఓవలి జగన్నాధాచార్యులు. బృందావనం శ్రీనివాసాచార్యులు, బృందావనం వెంకటాచార్యులు, పీసపాటి బదరీనాథ్ తదితరులు ఈ యాగాన్ని తలపెట్టి విజయవంతం చేశారు. స్థానికులు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని వరుణదేవుని స్మరిస్తూ పూజలు చేశారు.

## నేషనల్ అర్బన్ లీడర్ షిప్ ప్లాట్‌ఫారం ద్వారా జివియంసి బెస్ట్ ప్రాక్టీసెస్ తెలియజెప్పండి



విశాఖపట్నం :- నేషనల్ అర్బన్ లీడర్‌షిప్ ప్లాట్‌ఫారం ద్వారా జివియంసి బెస్ట్ ప్రాక్టీసెస్‌ను తెలియజెప్పడానికి రెండురోజుల ఇంక్యుబేషన్ వర్క్‌షాపు దోహదపడుతుందని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. కాన్ఫరెన్స్ హాలులో రెండు రోజుల ఇంక్యుబేషన్ వర్క్‌షాపును ఆయన సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వర్క్‌షాపు ఆవశ్యకత, లక్ష్యాలను గురించి వివరించారు. ఎన్.యు.ఎల్.పి ద్వారా జివియంసి విజన్ అండ్ మిషన్ పై తాత్కాలిక, మధ్యకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందించడానికి దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ఎన్.యు.ఎల్.పి ద్వారా మన శక్తి సామర్థ్యాలను తెలియజెప్పడానికి, ప్రదర్శించడానికి ఉపయోగపడుతుందని అభిలషించారు. వివిధ విభాగాల అధికారులు 24 7 త్రాగునీటిసరఫరా, మల్టీలెవెల్ కార్‌పార్కింగ్, స్మార్ట్ స్ట్రీట్స్, సోలార్ పవర్, హార్టికల్చర్, బిన్ ఫ్రీ సిటీ, వేస్ట్ టు బయోగ్యాస్, వేస్ట్ టు కంపోస్ట్, టౌన్‌ప్లానింగ్ శాఖలలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

అదేవిధంగా ఎన్.యు.ఎల్.పి చేపట్టిన మొదటి రెండు పైలట్ సిటీలలో జివియంసిని ఎంపిక చేయడం పట్ల మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ జాయింట్ సెక్రటరీ కునాల్ కుమార్ కు అభినందనలు తెలిపారు. ఏక్‌స్టెప్ ఫౌండేషన్ ప్రతినిధి శంకర్ మరువాడ క్లీన్, హెల్తీ, సస్టయినబుల్, లివబుల్ సిటీగా విశాఖ రూపొందాలని అభిలషించారు.

రెండు రోజుల వర్క్‌షాపులో మరిన్ని విషయాల గురించి చర్చించి వర్క్‌షాపును విజయవంతం చేయాలని అభిలషించారు. ఎన్.యు.ఎల్.పి క్యురేటర్ సంజయ్ పురోషిత్, ఎన్.యు.ఎల్.పి బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.


వర్క్‌షాపులో అదనపు కమిషనర్లు జివివియస్ మూర్తి, టి.సకలారెడ్డి, చీఫ్ ఇంజనీర్ ఎన్.దుర్గాప్రసాద్, యుసిడి పిడి డి.శ్రీనివాసన్, యస్.ఇలు వెంకటేశ్వరరావు, వినయకుమార్, ప్రసాదరాజు,మరియన్న, సి.యం.ఓ.హెచ్ డా.ఏ.హేమంత్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు, ఏడిహెచ్ దామోదర్, అందరు జోనల్ కమిషనర్లు, ఏ.యం.ఓ.హెచ్‌లు, స్మార్ట్‌సిటీస్ మేనేజర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఎన్ ఎస్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభోత్సవం



ములగాడ: పారిశ్రామిక ప్రాంతం 49 వ వార్డు పరిధిలో గల మల్కాపురం మార్కెట్ వీధిలో ఎస్ ఎన్ ఎస్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు ఈ చలివేంద్రాన్ని అనపర్తి పైడిరాజు ఆర్ లక్ష్మణరావు ఆర్థిక సహాయం అందించారు వారి చేతుల మీదగా వ్యాపారస్తులకు పాదచారులకు వాహనదారులకు మజ్జిగను పంపిణీ చేశారు అనంతరం పైడి రాజు లక్ష్మణ్ రావు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని యువత చక్కని ఆలోచనతో మా ముందుకు రావడంతో వారికి మా సహాయ సహకారాలు అందించామని అదేవిధంగా ఈ చలివేంద్రాన్ని స్థానిక ప్రజలందరూ వినియోగించుకోవాలని ఎస్ ఎన్ ఎస్ బాక్సింగ్ క్లబ్ ద్వారా ఇప్పటివరకు ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తూ వారికి పౌష్టికాహారం అందిస్తూ అదేవిధంగా బాక్సింగ్ కిట్ లను కూడా సహాయంగా అందిస్తున్నారని ఇన్ని సహాయాలు అందిస్తున్న బాక్సింగ్ క్లబ్ కోచ్ కనకరాజు స్ఫూర్తిగా తీసుకొని ఎంతోమంది విద్యార్థులు బాక్సింగ్ లో మంచి ప్రతిభను చూపిస్తూ ఇప్పటివరకు ఎన్నో విజయం సాధించారని ఇలాంటి సేవా కార్యక్రమాల్లో ముందు ముందు యువత పాల్గోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ప్రసాద్ వి గిరి బాబురావు బాక్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## వెంకన్న అన్నదాన ట్రస్ట్‌కు కర్రీ ట్రాలీలు బహూకరణ



రావులపాలెం : కోరిన వెంటనే వరాలనొసగే వాడపల్లి వేంకన్న ఆలయానికి ప్రతి రోజు భక్తుల తాకిడి పెరుగుతూ వస్తుంది. ఏడు శనివారములు వ్రతం చేసుకొని స్వామిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ప్రతీతి. స్వామి వారి దర్శనార్థం వచ్చే భక్తులకు భోజన వసతికి ఏర్పాటు చేసిన అన్న ప్రసాదం స్వీకరించుటకు సౌకర్యంగా రూ.44,500/- లు విలువ చేయు రెండు ఎస్ఎస్ స్టీలు కర్రి ట్రాలీలను రావులపాలెంకు చెందిన కీ॥శే॥ వెత్సా పట్టాభిరామారావు గారి జ్ఞాపకార్ధం వీరి కుమారులు మంగళవారం స్వామి వారి ఆలయంలో అందజేసారు. దాతలకు ఆలయ ఈఓ, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది స్వామి చిత్రపటాన్ని ప్రసాదాన్ని అందజేసారు. ఈ సందర్భముగా దాతలను పలువురు ప్రశంశించారు.

## వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలి - డాక్టర్ గాడి ప్రసాద్

విజయనగరం: వడదెబ్బ పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ హెూమియో వైద్యులు డాక్టర్ గాడి ప్రసాద్ అన్నారు. అలయన్స్‌క్లబ్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్-105 ఆధ్వర్యంలో స్థానిక రహదారులు భద్రత అతిథిగృహం సమీపంలో గల రైతుబజారులో వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తగా ఉచిత హెూమియో మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉందని, అవసరం లేకుంటే నీడపట్టునే ఉండడం మంచిదని, కాటన్ వస్త్రాలను ధరించాలని, ఎండలో తిరిగి వచ్చిన తరువాత తీపి పదార్థాలు, తేనె తీసుకోరాదని, శీతల పానీయాలుకు, ఐస్ క్రీములకు దూరంగా ఉండాలని, మంచినీరు ఎక్కువసార్లు తాగాలని,నిమ్మరసం, కొబ్బరినీరు శ్రేష్ఠమని అన్నారు.

# ఘనంగా కళ్యాణ వెంకటేశ్వర స్వామి తెప్పోత్సవం



భీమునిపట్నం: ఈ నెల 17 తేదీ నుండి 21 వ తేదీ వరకూ భీమిలి లోని కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని భీమునిపట్నం పుర వీదులలో ఊరేగించారు. అనంతరం గోస్తనీ, సాగర సంగమ ప్రాంతమైన ఉప్పుటేరు లో హంస వాహనంపై స్వామి వారిని సతీ సమేతంగా మేళ తాళాలతో మంగళవాయిద్యాల నడుమ తెప్పోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు.

## గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు నీతికథల పోటీ

భీమునిపట్నం: జిల్లా గ్రంధాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల విజ్ఞాన ప్రత్యేక వేసవి శిబిరం కార్యక్రమం స్థానిక నెహ్రు పాఠశాలలో నిర్వహించారు. భీమిలి గ్రంధాలయం శాఖా అధికారి బి.అప్పారావు ఆధ్వర్యంలో ఏప్రిల్ 25 నుంచి జూన్ 7వరకూ జరుగుతున్న ఈ కార్యక్రమంలో సోమవారం నీతికథలపై పోటీలు ర్వహించారు. ఈ పోటీలలో సుమారు ముప్ఫై మంది విద్యార్థిని ,విద్యార్థులు పాల్గొన్నారని గ్రంధాలయం అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ హిందీ ప్రేమీమండలి అధ్యక్షులు కె.ఎస్.ఆర్ కృష్ణారావు, ఆదర్శ హిందీ ప్రేమీమండలి తెలుగు,హిందీ ఉపాధ్యాయిణులు గాడు సూర్య కుమారి, దుర్గా సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురు విలేరులను అరెస్ట్ చేసిన పోలీసులు

భీమునిపట్నం: రెస్టారెంట్ యాజమాన్యాన్ని బెదిరించారనే అభియోగం పై మధురవాడ ప్రాంతానికి చెందిన ముగ్గురు విలేఖర్లను భీమిలి సీ.ఐ వెంకటనారాయణ అరెస్టు చేసినట్లు తెలిపారు. లంకపల్లి రఘు అనే విలేఖరి ఈ నెల 13 న తొట్లకొండ బేవాచ్ రెస్టారెంట్ కు రాత్రి భోజనానికి వెళ్ళారు . అయితే అక్కడ శు భ్రంగా లేవంటూ సిబ్బందితో వాదనకు దిగారని ఈయనకు పెంటిబోయిన వీరాస్వామి, బాలకృష్ణ పాత్రో సహకరించారని ఈ ముగ్గురూ కలిసి ఫోటోలు తీసి యజమాని ని బెదిరించారని. వార్తలు రాయకుండా ఉండాలంటే ముప్పయి వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో రెస్టారెంట్ మేనేజర్ సతీష్ భీమిలి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. సతీష్ ఫిర్యాదు మేరకు విచారించి వీరిని ఆదివారం అరెస్ట్ చేసి సాయంత్రం విడుదల చేసినట్లు సి.ఐ వెంకట నారాయణ తెలిపారు.

## భానుడు భగభగలు

యలమంచిలి రూరల్: యలమంచిలిలో సూర్యడు నిప్పులు చెరిగాడు. వడగాడ్పులు ప్రజలను అల్లాడించాయి. సాయంత్రం 4 గంటల వరకు వాతావరణం చల్లబడలేదు. వృద్దులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఇళ్లు విడిచి బయటకు రావడానికి ఎవరూ సాహసించలేదు. రోడ్లన్నీ మధ్యాహ్నం నిర్మానుషంగా మారాయి. శీతల పానీయాల అమ్మకాలు జోరందుకున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

# కేథరిన్ స్కూల్ విద్యాప్రమాణాలకు బ్రిటీష్ కౌన్సిల్ అవార్డు




భీమునిపట్నం: కేథరిన్ స్కూల్లో అంతర్జాతీయ విద్యా ప్రమాణాలకు బ్రిటిష్ కౌన్సిల్ వారి ఇంటర్నేషనల్ స్కూల్ అవార్డు స్థానిక మూలకుద్దు లో ఉన్న కేథరిన్ స్కూల్ కు దక్కించుకున్నట్లు స్కూల్ డైరెక్టర్ ఇవాంజలిన్ రాయ్ విలేఖరులకు తెలిపారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత 36 సంవత్సరాలు గా కేథరిన్ స్కూల్ లో సాధారణ ఫీజులతో అత్యుత్తమ విద్యను అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొంది గత నాలుగు సంవత్సరాలుగా పుట్టగొడుగుల్లా మొలుస్తోందని అన్నారు. ఈ రోజుల్లో ఇంటర్నేషనల్ స్కూళ్లు లక్షలు ఫీజు లు వసూలు చేస్తున్న సాధారణ ఫీజుల తో వాటికి ధీటుగా సదుపాయాలు కల్పించడమే కాకుండా, అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో బోధన విధానాలు,అలాగే అంతర్జాతీయ ఉపాధ్యాయ సిబ్బంది నూతన వరవడి సృష్టించినట్లు. కేథరిన్ స్కూల్ డైరెక్టర్ డా.సుష్మా ఏవంజలీన్ రాయి ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు సహకారంతో ఈ గుర్తింపు పొందడం చాలా గర్వ కారణమని తెలిపారు. ఇలాంటి గుర్తింపు విశాఖ రూరల్ లో ఏకైక పాఠశాల కేథరిన్ మాత్రమే నని అన్నారు. అనేక స్కూళ్లు పేరుకి మాత్రమే ఇంటర్నేషనల్ స్కూళ్లు అని, ఇటువంటి గుర్తింపు పొందలేదని తెలిపారు.

ఈ సందర్భంగా సిబ్బందికి, విద్యార్థులు తల్లిదండ్రులు సహకారాన్ని ఎప్పటికి మరచి పోననీ ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధినేత అలీవర్ రాయ్, స్కూల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## భీమిలిని మున్సిపాలిటి గానే ఉంచాలి వినతి పత్రం



భీమునిపట్నం: భీమిలిని విశాఖ జీ వి ఎంసి లో విలీనం నిలుపుదల చెయాలని అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు సోమవారం జోనల్ కమిషనర్ సి.హెచ్. గోవిందరావు కు వినతి పత్రం అందజేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బారత దేశంలో రెండవ పురపాలక సంఘం గాను ఆంధ్రప్రదేశ్ లో ప్రదమ పురపాలక సంఘంగా 150 సంవత్సరాల ఘన చరిత్ర కలిగి ఉందని ఈ పురపాలక సంఘం ప్రజలు కాపాడుకోవాలని ముక్తకంఠంతో కోరుతున్నారు. ఇక్కడ మత్స్యకారులు,వ్యాపారస్తులు, వ్యవసాయ దారులు ఎక్కువగా ఉన్నారు.వీరికి జీవనోపాధి కి కరవు ఏర్పడిందని ,అలాగే అధిక పన్నుభారం, ఖాళీ స్థలాలకు కూడా పన్ను భారం అలాగే ఉద్యోగావకాశము లేక పోవడం ,జ్యూట్ మిల్ లాకౌట్ తదితర కారణాలతో భీమిలి ప్రజలు భీమిలిని జీవిఎంసి లో కలపడం వలన అనేక ఇబ్బందులకు గురవుతున్నారని,అలాగే భీమిలి కౌన్సిల్ ఉన్నప్పుడు కూడా వారు భీమిలిని జివిఎంసిలో విలీనం వ్యతిరేకించారని, మా సమస్యలను అవగాహన చేసుకొని పురపాలక సంఘం గా వుంచాలని జీవిఎంసిలో విలీనం కాకుండా చూడాలని వారు జోనల్ కమిషనర్ ని కోరారు.

# తూర్పు కాపులు ఏకం కావాలి

## - కెంగం హరి రామ ప్రసాద్



కాకినాడ: రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాలో ఉన్న తూర్పు కాపులు అందరూ కలిసికట్టుగా పోరాడి ఓబిసి సాధించే వరకు పోరాటం చేయాలి అని ఆంధ్రప్రదేశ్ తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, భాజాపా ఓబిసి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కెంగం హరి రామ ప్రసాద్ పిలుపునిచ్చారు, రాష్ట్రంలో ఉన్న 13 జిల్లాల లలో కేవలం ఉత్తర ఆంధ్ర మూడు జిల్లాల లో మాత్రమే తూర్పు కాపు లకు ఓబిసి రిజిస్ట్రేషన్ కల్పిస్తున్నారు అని మిగిలిన జిల్లాలో కూడా ఇది వర్తింపజేయాలని ఆయన ఒక ప్రకటన లో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం లో ఎన్నో జాతీయ విద్యా సంస్థల్లో ఈ ఓబిసి రిజర్వేషన్లు లేక అటు ఇడబ్ల్యూఎస్ వర్తించక ఈ పది జిల్లాలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని, తక్షణం మిగిలిన 10 జిల్లాలోని తూర్పు కాపులకు కూడా ఈ ఓబిసి రిజర్వేషన్లు కల్పించాలని కెంగం హరి రామ ప్రసాద్ కోరారు, లేని పక్షం లో దశల వారీగా అన్ని జిల్లాల్లో తూర్పు కాపు నాయకులు పెద్దలు కలిసి జిల్లాల వారీగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# రోటరీ సెంట్రల్‌చే మల్టీ చలివేంద్రం




కాకినాడః స్థానిక గాంధీనగర్ దక్షణ ప్రవేశద్వారం వద్ద రోటరీ సెంట్రల్ క్లబ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉదయం మట్టా ఉమాదేవి ప్రారంభించారు. ఈ చలివేంద్రంలో నిమ్మరసంతో తయ్యారు చేసిన నీళ్ళు, మజ్జిగ, రస్నాలను సుమారు 3 వేలమందికి పంపిణీ చేసారు. క్లబ్ పుర్వాధ్యక్షుడు మట్టా సాయిరామ్ మాట్లాడుతూ వేసవి తాపం నుండి పాదచారులు, వాహనదారులకు కాపాడాలన్న తపనతో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. వృద్దులకు ఓఆర్ఎస్ ప్యాకేట్లను కూడా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. కమ్యునిటీ సర్వీస్‌లో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నమని చెప్పారు. ప్రతీ సంవత్సరం సామాజిక సేవలో భాగంగా భారీ వ్యయంతో సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తూవున్నామన్నారు. ప్రభుత్వపరంగా ఈ సంవత్సరం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ప్రజల దాహార్తిని తీర్చాలన్న భావంతో గాంధీనగర్ పార్కు గేటువద్ద ఏర్పటుచేసామన్నారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్ రామానుజం మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలలో రోటరీ సెంట్రల్ క్లబ్ సేవలు శ్లాఘనీయమన్నారు. మట్టా సాయిరామ్ ఎంతో వ్యయంతో చలివేంద్రాన్ని నిర్వహణకు ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు, ఎన్. వెంకటలక్ష్మి, కార్యదర్శి డా. గోపి, వాకచర్ల సూర్యం, బోడా ఆనంద్, అనుపమ, సాగర్, అపెక్స్ మూర్తి, వీరబాబు, లక్ష్మీనారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వందయూనిట్లు లోపు విద్యుత్ ఉచితంగా ఇవ్వాలి సీపీఎం నాయకులు గంగరాజు,మొసియా



అనంతగిరి: గిరిజనులకు 100 యూనిట్ లోపు ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం అనంతగిరి మండల విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు ఈకార్యక్రమంలో సిపిఎం నాయకులు గంగరాజు మోస్య మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు నుండి గిరిజనులకు 100 యూనిట్ లోపు ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి మోసం చేస్తుందని విమర్శించారు 10 యూనిట్ 20 యూనిట్ వచ్చిన వారికి కూడా వేల రూపాయలు బిల్లులు ఇస్తున్నారు విమర్శించారు కొండిభ పంచాయతీ ముమ్వంవలస గ్రామనివాసి సమర్థి ప్రసాదరావు కు 8733 రూపాయలు బిల్లులు వచ్చిందని తెలిపారు టోకురు పంచాయతీ కొండిభ పంచాయతీ అనంతగిరి వేంగడ ఎగువశోభ గిరిజనులు సీపీఎం నాయకులు బుద్రయ్య సుబ్బారావు బీమన్న ధర్నా లో పాల్గొన్నారు.

## చంద్రన్న కానుక పంపిణీలో జాప్యం

అనంతగిరి: మండలం లో కోండిబ డిపో సాప్ నెశీ,,139 లో చంద్రన్న కానుక సరుకులు పంపిణీ లో అవకతవకలు జరిగిందని రేషన్ కార్డు లబ్ధిదారులు కిలో గోవర్ధన్ బలరాం తదితరులు సోమవారం విలేకరులకు తెలిపారు .

డిపో పరిధిలో 200 రేషన్ కార్డులు ఉన్నాయని ఒక్కొక్క రేషన్ కార్డుకి రెండు కెజీలేసి కందిపప్పు, రాగి పిండి ఇవ్వవలసి ఉండగా కుదించి ఒక కేజీ చొప్పున్న లబ్ధిదారులకు ఇచ్చారని రేషన్ కార్డు దారులు వారి ఆవేదన వ్యక్త పరిచారు తోటి గిరిజనుడైన డ్వాక్రా డీలర్ గిరిజనులకే ఇంతమోసామ్ చేశాడని వారు వపావుతున్నారు.సుమారుగా 2, కేజీలు కందిపప్పు ,2, కేజీల రాగి పిండి కాజేసాడని స్థానికులు ఆరోపిస్తున్నారు.అలాగే కాజేసిన మొత్తం వస్తువులను వెలకటితే సుమారుగా ఇరువది వేళారూపాయులు అవుతుందని అన్నారు నష్టపోయిన లబ్ది దారులకు జిసిసి అధికారులు సివిల్ సప్లయాధికారులు చొరతీసుకొని మిగిలిన కందిపప్పు, రాగిపిండి కేజీ చొప్పన్న ఇప్పించి డీలార్ పై కఠినచర్యలు తీసుకోవాలని రేషన్ కార్డు లబ్ది దారులు,స్థానికులు డిమాండ్ చేశారు.

# ఘనంగా జర్నలిస్టు డే వేడుకలు



కాకినాడ: నారద ప్రకాశన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నారద జయంతి,జర్నలిస్టుడే వేడుకలు ఘనంగా జరిగాయి.కాకినాడ అచ్చుతారం గేటువద్దగల ఆర్ఎస్ఎస్ భవన్‌లో సోమవారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్ఎస్ఎస్ స్వయం సేవక్ ఓలేటి సత్యనారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలనే తపన పడే వ్యక్తులకు జర్నలిస్టులు ఆదర్శం కావాలని కోరారు.దిగజారుతున్న మానవ విలువలు చర్చించడమే కాకుండా సమాజ స్థాయిని నిలబెట్టేందుకు చేసే ప్రయత్నమే నారద జయంతి వేడుకల లక్ష్యమని పేర్కొన్నారు.

జర్నలిజానికి ఆద్యుడు నారద మహర్షిఅని పేర్కొంటూ ఉన్నత విలువలను పాటించిన జర్నలిస్టులను సన్మానించడం తమ కర్తవ్యం అన్నారు.సన్మాన గ్రహీత సీనియర్ జర్నలిస్టు తంగిశెట్టి మధుసూదనరావు మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్, కమ్యూనిజం రెండూ నిజాయితీగల వ్యవస్థలని వాటి నుండి ఎంతో నేర్చుకున్నానన్నారు.జర్నలిజంలో నార్ల వెంకటేశ్వరరావు,హిందూ సంపాదకులు రాంనాథ్ గోయింక తన గురువులని వారిని ఆదర్శంగా తీసుకొని 54సం॥ల జర్నలిస్టు జీవితం గడిపానన్నారు.నారధుడు లోక కళ్యాణం కోరాడే తప్ప లోక కంఠకుడు కాదన్నారు.జర్నలిజం అంటే సమాజ శ్రేయస్సు కోరాలని, నిజాన్ని ముక్కుసూటిగా వ్రాస్తే అది సమాజమితం కాదన్నారు.సత్యశోధన చేసి వార్తను ప్రజలకు అందించాలని దేశ స్వాతంత్రియ సముపార్జనలో నాటి పత్రికలు ప్రముఖ పాత్ర పోషించాయని, ప్రస్తుతం విలువలు లేని వ్యాపారదృక్పదంతో నడుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. జర్నలిస్టులు వైట్ కాలర్ వర్కర్స్‌గా మారారని వారి సంక్షేమం పాలకులుకు పట్టడంలేదన్నారు.

ఏది ఏమైనా జర్నలిస్టులు ఆదర్శంగా మెలగాలని ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న ట్రస్టును అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సన్మానగ్రహీత సత్యమూర్తి, రంగా చార్చులు ,ఎస్‌కె రెడ్డి(సూర్య) తమ అనుభవాలను వివరించారు.అనంతరం ట్రస్టు సభ్యులు మధుసూదనరావు,కొండవర్తి సత్యమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామచంద్రరావు, సరిపల్లె శ్రీరామ చంద్రమూర్తి,కళ్యాణ్ కుమార్,ఆకెళ్ళ సుబ్రహ్మణ్యం ,పలువురు జర్నలిస్టులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# రాజమండ్రిలో జాతీయ జ్యోతిష్య సదస్సు

## రాయప్రోలు, జాంపడులకు గౌ॥ డాక్టరేట్‌లు - వైద్యశాస్త్రంపై జ్యోతిష్యపరంగా సమీక్ష



కాకినాడః జాతీయజ్యోతిష్య సదస్సును ఆగష్టు 10న రాజమండ్రిలో నిర్వహించేందుకు ఏకగ్రీవంగా తీర్మానించారు. సోమవారం స్థానిక వేదవిజ్ఞాన ప్రతిష్టానమ్ కార్యాలయంలో అఖిలా భారత జ్యోతిష్య సమాఖ్య తెలుగు రాష్ట్రాల సర్కిల్ గవర్నర్ ప్రముఖ జ్యోతిష్య పండితులు డా. చెరుకుపల్లి లక్ష్మీనరసింహాశర్మ అధ్యక్షతన సమగ్రంగా చర్చించి సదస్సును నిర్వహణాఏర్పాట్లు మరియు ఆహ్వానితుల పేర్లను ఖరారు చేసారు. జూన్ మాసంలో మరొకసారి సమావేశం కావాలని సమావేశం నిర్ణయిచింది.

జాతీయ జ్యోతిష్య సదస్సు డా. చెరుకుపల్లి లక్ష్మీనృశింహాశర్మ స్వీయ పర్యవేక్షణలో విశాఖనగరానికి చెందిన జ్యోతిష్య వాస్తు విద్య పీఠాధిపతులు నిట్టల ప్రసాద్ ఆధ్వర్యంలో ఆగష్టు 10న రాజమండ్రిలో భారీస్థాయిలో నిర్వహిస్తామని జ్యోతిష్య సమాఖ్య రాజమండ్రి విభాగ అధ్యక్షులు డా. పుసులూరి ఫణిశర్మ తెలిపారు. సదస్సు సందర్భంగా స్టాల్స్ ఏర్పాటు కూడా వుంటుందని చెప్పారు.

తొలిసారిగా జ్యోతిష్యంలో వైద్య శాస్త్రం అనే అంశంపై సదస్సులో సమగ్రంగా సమీక్షిస్తారు. ఆంధ్ర, తెలంగాణా, చెన్నై, ముంబాయి, బెంగుళూరు రాష్ట్రాల నుండి జ్యోతిష్యపండితులు సదస్సులో పాల్గొంటారు. పుచ్చాశ్రీనివాస్ (విజయవాడ) సాకి కరుణాకర శర్మ (హైదరాబాద్) ఎమ్. సత్యనారాయణ (విశాఖ), మహేష్ చంద్ర (హైదరాబాద్), పి. రామకృష్ణ (తాడేపల్లిగూడెం), ఆర్.వి భగవత్ (ముంబాయి), బుట్టే వీరభద్రశర్మ (రాజమండ్రి), మధుర పాల శంకరశర్మ (రాజమండ్రి), ఎమ్‌విఆర్‌జె శర్మ (జాంపండు మాస్టార్ రాజమండ్రి), సుదర్శన్ (చెన్నై) పరిమిసాంబయ్య (ఏలూరు), చింతా గోపిశర్మ సిద్దాంతి (పెద్దాపురం), శ్రీమతి నేమాని సరస్వతి (కాకినాడ)తో పాటుపలువుర్ని ఆహ్వానిస్తున్నమన్నారు. ఈ సదస్సులో పాల్గొనదలచిన జ్యోతిష్య పండితులు వారి వివరాలను ఫణిశర్మ 9440490999లో సంపాదించి పంపాల్సిందిగా కోరారు.

జాతీయ జ్యోతిష్య సదస్సు వేదికపై గౌరవ డాక్టరేట్లతో ప్రతిష్టానం తరపున ఇద్దరిని సత్కరించదలచామని ప్రకటించారు. వేద మరియు పురోహిత రంగంలో గత రెండు దశాబ్దలుగా విశేష కృషిచేసిన రాయప్రోలు ప్రసాదశర్మ (కాకినాడ) జ్యోతిష్యరంగంలో విశేష కృషిచేయడమే కాక అనేక గ్రంధాల విడుదలకు ప్రత్యేక శ్రద్ధ చూపిన ఎమ్.వి.ఆర్.జె శర్మ (జాంపండు మాస్టారు - రాజమండ్రి)లకు ప్రదానం చేయదలిచామని డా. చెరుకుపల్లి తెలిపారు.

సదస్సు నిర్వహన సమావేశంలో యాతగిరి పరశురామ్, దత్తుతోపాటు వారణాశిరకుమార్, బాపిరాజు, శ్రీమతి పరిమళ, మోహన్ పలువురు పాల్గొన్నారు.

## అనంతగిరిలో ఈదురు గాలులుతో భారీ వర్షం



అనంతగిరి: మండల కేంద్రంలో సోమవారం నాడు ఉరుములు మెరుపులతో సుమారు రెండు గంటల పాటు వర్షం పడింది ఈసంవత్సరం ఇదే పెద్ద వర్షం పడటం వలన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఈ వర్షం వలన రైతులకు పొలం పనులు చేసుకొనుటకు అవకాశం ఏర్పడుతుంది పోడు వ్యవసాయం చేసుకొనుటకు ఎంతో అవకాశం ఉంటుంది అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఈ వర్షం పడడం వలన ఉష్ణోగ్రత ప్రభావము చాలా వరకు తగ్గే అవకాశంఉంది,

# విజయభాను సంపాదకీయం

## అప్రమత్తమైన కాంగీ నాయకత్వం

ఎన్డీయేలో లేని అన్ని పక్షాలను కలుపుకొని పోవాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. తాము విజయం సాధించలేనప్పుడు కనీసం ప్రత్యర్థిని కట్టడి చేయడం రాజనీతి. గోవా, మరో రెండు ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలు తెచ్చుకొని కూడా అధికారం బీజేపీకి అప్పగించడం విమర్శలకు దారితీసింది. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు జరిగినప్పుడు- అవసరమైతే జనతాదళ్ (ఎస్)కు మద్దతు ఇవ్వాలని ఫలితాలు వెలువడటానికి ముందే నిర్ణయానికి వచ్చింది. అప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేసినా, మోదీ-అమిత్ షా కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించేవారే. ఢిల్లీ పీఠం బీజేపీకి దక్కకుండా చేయడమే ఇప్పుడు కాంగ్రెస్ కోరుకునేది. ఎన్నికలు దాదాపుగా ముగింపునకు వచ్చిన తరుణంలో తాము ప్రధాని పదవిపై పట్టుబట్టబోమంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం విజ్ఞతతో కూడుకున్న వ్యాఖ్య. కాంగ్రెస్ పార్టీ అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, ఏదైనా ప్రాంతీయ పార్టీ నాయకుడికి (ప్రధానిగా) మద్దతు ఇవ్వడానికి వెనుకాడబోమని కాంగ్రెస్ పార్టీ ప్రముఖుడు గులాం నబీ ఆజాద్ గురువారం నాడు సిమ్లాలో స్పష్టం చేశారు. మా పార్టీ నాయకత్వం ఈ విషయం ఇప్పటికే స్పష్టం చేసిందని కూడా ఆయన అన్నారు. అంతకుముందు రోజు పాట్నాలో కూడా ఇదేరీతిలో మాట్లాడారు. ప్రధాని పదవిని వివాదంగా మార్చబోమని కూడా ఆయన అన్నారు. దీన్నిబట్టి కేసీఆర్ ఊహించినట్టుగానే- బీజేపీ మెజార్టీ సాధించలేదని, ఆ స్థానాన్ని కాంగ్రెస్ భర్తీ చేయలేదనీ స్పష్టమవుతున్నది. ప్రాంతీయ పార్టీలు కలిసికట్టుగా ఉంటే, ఫెడరల్ ఫ్రంట్‌కు ఏదో ఒక జాతీయపార్టీ మద్దతు ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడుతుందని కూడా కేసీఆర్ సరిగ్గానే అంచనావేశారు. ఇందుకోసం రాష్ట్రాలు పర్యటించి ప్రాంతీయ పార్టీలకు తమ సంఘటిత శక్తిపై విశ్వాసం కలిగించారు. ఫలితాలు వెలువడగానే ఎన్డీయే ముక్కలవుతుందని తృణమూల్ కాంగ్రెస్ నాయకులు డెరెక్ ఒ బ్రియెన్ వ్యాఖ్యానించారు. ఇప్పుడు అనివార్యంగా బీజేపీతో ఉన్న ఈశాన్య పార్టీలన్నీ బయటికి వస్తాయని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్‌లో తమ ప్రత్యర్థులైన కాంగ్రెస్, వామపక్షాలు కూడా కలిసివస్తాయంటూ, బెంగాల్ మ్యాచ్ వేరు, ఢిల్లీలో మ్యాచ్ వేరు అన్నారాయన. బీఎస్పీ నాయకురాలు మాయావతి, ఎస్పీ నేత అఖిలేశ్, కేరళ ముఖ్యమంత్రి విజయన్ తదితరులు ఇటీవలికాలంలో చేసిన వ్యాఖ్యలు జాతీయపార్టీల పల్లకి మోయకూడదనే భావనను బలపరుస్తున్నాయి. సాధారణంగా అయితే కాంగ్రెస్ పార్టీ కేంద్రకంగా యూపీఏ అధికారం చేపట్టడానికి ప్రయత్నించేదే. ఇప్పటికీ అవకాశం వస్తే తాము పీఠం పై కూర్చోవాలనే ఆశ ఉన్నది. కానీ ఫెడరల్ ఫ్రం ట్ ప్రతిపాదన తర్వాత ఎన్నికలకు ముందు నుం చే ప్రాంతీయపార్టీల వైఖరి దృఢంగా మారింది. కాంగ్రెస్ పార్టీ వ్యవహారసరళి ప్రాంతీయ పార్టీల తో ఎడాన్ని పెంచింది. పశ్చిమ, మధ్య రాష్ట్రాల లో బీజేపీ పట్ల వ్యతిరేకతను తమకు అనుకూలంగా మలుచుకోవడంలో కాంగ్రెస్ పార్టీ పెద్దగా సఫలం కాలేదని తెలుస్తున్నది. దీంతో ప్రాంతీయపార్టీలతో కనీసం సంప్రదింపులు జరిపే సౌహార్ద పరిస్థితి నెలకొల్పుకోవాలని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తున్నది. గులాం నబీ ఆజాద్ చేత వరుసగా ప్రకటనలు చేయించడం ప్రాంతీయపార్టీలతో మాటలు కలిపేందుకే. సోనియా గాంధీ ప్రాంతీయ పార్టీలతో చర్చలకు ఉద్యుక్తులయినట్టు, టీఆర్ఎస్, వైసీపీ, బీజేడీ వంటి తట స్థ పక్షాలకు కూడా సందేశాలు పంపుతున్నట్టు తెలుస్తున్నది. ఎస్పీ, బీఎస్పీలతో చర్చలు జరిపే బాధ్యతను ఇద్దరు సీనియర్ నాయకులకు అప్పగించినట్టు తెలుస్తున్నది. ఎన్డీయేలో లేని అన్ని పక్షాలను కలుపుకొని పోవాలనేదే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఆ పార్టీ నేతలు అంటున్నారు. తాము విజయం సాధించలేనప్పుడు కనీసం ప్రత్యర్థిని కట్టడి చేయడం రాజనీతి. గోవా, మరో రెండు ఈశాన్య రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎక్కువ స్థానాలు తెచ్చుకొని కూడా అధికారం బీజేపీకి అప్పగించడం విమర్శలకు దారితీసింది. ఆ తర్వాత కాంగ్రెస్ నాయకత్వం అప్రమత్తమైంది. కర్ణాటక అసెం బ్లీ ఎన్నికలు జరిగినప్పుడు- అవసరమైతే జనతాదళ్ (ఎస్)కు మద్దతు ఇవ్వాలని ఫలితాలు వెలువడటానికి ముందే నిర్ణయానికి వచ్చింది. అప్పుడు ఏ మాత్రం ఆలస్యం చేసినా, మోదీ-అమిత్ షా కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించేవారే. ఢిల్లీ పీఠం బీజేపీకి దక్కకుండా చేయడమే ఇప్పుడు కాంగ్రెస్ కోరుకునేది. రాజకీయ విశ్లేషకుల అంచనా ప్రకారం- ఈసారి ఎన్నికలలో ఏ ప్రభంజనమూ లేదు. ఈ ఎన్నికలలో జాతీయపార్టీలను తట్టుకొని ప్రాంతీయపార్టీలు బలంగా నిలిచాయి. 2009లో 116 సీట్లు గల బీజేపీ 2014లో బలాన్ని 282కు పెంచుకున్నది.

## వృద్ధులకు ప్రత్యేక పథకాలు ప్రకటించాలి

అనకాపల్లి : ప్రపంచ వ్యాప్తంగా అమల్లో ఉన్న చట్టాలు పరిశీలించి వాటిలో వృద్ధులకు ఉపయోగపడే పలు పథకాలను దేసంలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందని వృద్ధాప్య సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేసారు. అనకాపల్లి వీవీ రమణ రైతు భారతిలో ఆదివారం గ్రామీణ వయోవృద్ధుల ప్రజా సంక్షేమసంఘం ఆధ్వర్యంలో వృద్ధుల గుర్తింపు కార్డుల పంపినీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయా సంఘాల ప్రతినిధులు కాండ్రేగుల అప్పారావు, డాక్టర్ శరగడం నూకరాజు, కొణతాల రమణ అప్పారావు, శ్రీరాములు, జగ్గారావు, అన్నపూర్ణ తదిరులు మాట్లాడారు. దేశంలో వృద్ధుల సంక్షేమానికి ఇంతవరకు సరైన పథకాలు లేవన్నారు. అన్ని వర్గాలకు ఇచ్చిన ప్రాధాన్యతను ఇవ్వడం లేదన్నారు. దేశంలో వృద్ధాప్యాన్ని ఎవరు శాపంలా, బాధగా భావించకుండా చూల్సిన బాధ్యత పాలకులపైనే ఉందన్నారు.

## సంక్షేమ పథకాలే టీడీపీని గెలిపిస్తాయి



అనకాపల్లి ... తెలుగుదేశంపార్టీని సంక్షేమ పథకాలు గెలిపిస్తాయని, విశాఖ అర్బన్ జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మళ్ల సురేంద్ర అన్నారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసారు. ఈనెల 23 న జరిగే ఓట్ల లెక్కింపులో ఇది రుజువు కానుందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, అనకాపల్లిలో పీలా గోవిందసత్యనారాయణ విజయం కాయమని జోష్యం చెప్పారు. తెలుగుదేశంపాలనలో సంక్షేమ పథకాలు అందుకుని ప్రజలు సంతృప్తిగా ఉన్నారని అన్నారు. నిరంతరం ప్రజా జీవితంలో గడుపుతూ ప్రజల కష్టసుఖాల్లోపాల్గొంటూ ఒక సామాన్య వ్యక్తిగా ప్రజలలో కలిసిపోయిన పీలా గోవిందసత్యనారాయణ అధిక మెజార్టీతో గెలుస్తారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలు గ్లోబల్ ప్రచారం చేస్తున్నారు తప్ప ప్రజలకు ఎనాడు మంచి చేయలేదన్నారు. హుదూద్ నుంచి నేటివరకు ఎన్నో విపత్తులు ఎదురైన ప్రజలను ఆదుకునేది ఒక్క తెలుగుదేశంపార్టీ మాత్రమేనని అన్నారు. ఎవరూ అధైర్య పడాల్సిన పనిలేదన్నారు. ఖచ్చితంగా టీడీపీ గెలుస్తుందన్నారు. కౌంటింగ్‌కు వెళ్లే ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. 110 సీట్లు రాష్ట్రంలో టీడీపీ కైవసం చేసుకుంటుందని ఎంపీగా ఆనంద్ కుమార్ విజయం తధ్యమని, చెప్పారు.

## గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్య సేవలు

### అందించి నష్టపరిహారం ఇవ్వాలి

అచ్యుతాపురం : స్థానిక సెజ్ లో గల ఇనోవర్ ల్యాబ్ లో విధులు నిర్వహిస్తు గాయపడిన ముగ్గురు కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించి నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు .సోమవారం ఆయన స్థానిక స్టార్ జెన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న కార్మికులను సిఐటియు నాయకులతో కలిసి పరామర్శించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలు పాటించకుండా కార్మికులకు అతి తక్కువ వేతనాలు ఇస్తూ వారి శ్రమను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు .ప్రమాదం పై సమగ్ర విచారణ జరిపి గాయపడిన కార్మికులకు వేతనం తో కూడిన సెలవు మంజూరు చేసి నష్టపరిహారం ఇవ్వాలన్నారు .పరామర్శించిన వారిలో బుద్ధా రంగారావు తదితరులు ఉన్నారు .



## 'పల్లె గూటికి పండగొచ్చింది' సినిమాను ఆదరించండి



డాబాగార్డెన్స్: నేటి యువతరానికి చక్కటి మెసేజ్‌ను అందించే ప్రక్రియలో భాగంగా పల్లె గూటికి పండగొచ్చింది అనే చిత్రాన్ని కంచరాన తిరుమల రావు దర్శకత్వంలో, దివ్య తేజస్విని ప్రొడక్షన్స్ ద్వారా నిర్మించడం జరిగిందని, ఈ చక్కటి కథాంశాన్ని ప్రజలందరు ఆశీర్వదించాలని సీనియర్ నటుడు సుమన్ పేర్కొన్నారు. సోమవారం ద్వారకా నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా సుమన్ పాల్గొని మాట్లాడారు. జై జవాన్, జై కిసాన్ అనే ప్రత్యేకమైన అంశం ఈ సినిమాలో ఇమిడి ఉంటుందన్నారు. సినిమా దర్శకుడు కంచరాన తిరుమల రావు మాట్లాడుతూ గ్రామాల్లోని యువతరం సినిమా మోజులో పడి అనుష్క, నయన తారల విగ్రహాలను నెలకొల్పుతాం అని పనికిరాని గొడవలు పడుతూ చివరకు తమ గ్రామాన్ని స్మార్ట్ సిటీగా రూపొందించి స్వచ్ఛ భారత్‌కు అనుసంధానంగా నిలిచే ఈ కథాంశం ఎంతో చక్కగా ఉంటుందన్నారు.

ఈ సినిమాలో ఎంటర్టైన్మెంట్, కామెడీ , యువతరానికి చక్కటి మెస్సేజ్ అనే అంశాలను మేళవించామన్నారు. అనుష్క నయనతారల విగ్రహాలు కడతామని బయలుదేరిన యువకులు చివరికి ఏ విగ్రహాలను తమ గ్రామాల్లో కట్టారో క్లైమాక్స్‌లో ప్రజలందరూ ఆసక్తిగా తిలకిస్తారన్నారు. కుటుంబ సభ్యులు అందరూ చక్కగా చూడవలసిన చిత్రంగా ఆయన పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో వీ జే ఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, రవితేజ, సినిమా నటీనటులు తదితరులు పాల్గొని సీనియర్ నటుడు సుమన్‌ను ఘనంగా సత్కరించారు.

## సమయం కవి

### స్వార్థపరులు ప్రజలకు మంచి చేయరు

స్వార్థం అనేది మనిషికి ఉండే దుర్గుణాలలో ఒకటి. స్వార్థం వీడితే మనిషి మనస్సు దైవత్వంతో నిండిపోతుంది. అయితే నేడు అందరిలోనూ స్వార్థం ఎక్కువైపోయింది. దేశాన్ని నడిపించే నాయకులు, అధికారులు స్వార్థంతో దేశప్రగతికి తూట్లు పొడుస్తున్నారు. నాయకులు, అధికారులు స్వార్థచింతన మానితే మనదేశం బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతుంది. తమ వారికి మాత్రమే మేలు జరిగే పథకాలను ప్రవేశపెడుతున్నారు. తమకు అనుకూలమైన చట్టాలు చేస్తున్నారు. ఆ పార్టీ ఈ పార్టీ అవి ఏమీ లేదు. అంతా దొంగలే. ఖరీదయిన ఖద్దరు దొంగలు కాబట్టి మనం నాయకులను ఎన్నుకొనేటప్పుడు మంచి వ్యక్తిత్వం, సేవా దృక్పథం ఉన్నవారిని ఎన్నుకోవాలి. అప్పుడు మనకు మేలు కలుగుతుంది. రాజకీయ నాయకులు తమ విధులను నిజాయితీగా నిర్వర్తిస్తే అధికారులు కూడా సక్రమంగా పనిచేస్తారు. కానీ నేటి నాయకులు ఎన్నికలలో విపరీతంగా ధనాన్ని ఖర్చు చేసి అధికారంలోకి వచ్చాక దానికి పదిరెట్లు ప్రజాధనాన్ని స్వాహా చేస్తున్నారు. ప్రజలు కూడా నోట్లకి ఓట్లను అమ్ముకుంటున్నారు. స్వార్థపరులగు రాజకీయ నాయకుల గురించి ఓ శతకకవి ఇలా వ్రాశాడు.

'క్రూరమృగము నడవి గూల్చ వేటయగును
క్రూరు నూర గూల్చ నేరమగును
స్వార్థపరులు చేయు చట్టము లిట్లుండు
త్రిపురనేని వాణి తెలుగుబాణి'

...కవితా రచన
వడ్లమాని అన్నపూర్ణ

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : తదియ రా. 1.41 మూల రా.3.31ప.వ. 10.50ల 12.30 రా.వ 1.51ల 3.31

మంగళవారం 21-05-2019

**మేషం** : స్త్రీలకు పనివారలతో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు. క్రయ విక్రయ రంగాలలోని వారికి నూతన ఉత్సాహం కానవస్తుంది. కాంట్రాక్టర్లకు అధికమైన ఒత్తిడి తప్పదు. వాహన విషయంలో సంతృప్తి కానవస్తుంది. స్థిరాస్తి క్రయ విక్రయాలకు సంబంధించి ప్రముఖులతో సంప్రదింపులు జరుపుతారు. **వృషభం** : మీ కళత్ర మొండి వైఖరి, కుటుంబీకుల పట్టుదల మనశ్శాంతిని దూరం చేస్తాయి. ఇంటర్వ్యూలలో శ్రద్ధ వహించండి. విద్యార్థినులు ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలి. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం విదేశాలు వెళ్లేందుకు మార్గం సుగమవుతుంది. ఇతరుల ఆంతరంగిక విషయాలలో తలదూర్చకండి. **మిథునం** : రావలసిన బకాయిల విషయంలో మెళుకువ అవసరం. సోదరీ, సోదరు లతో ఏకీభావం కుదరదు. ఐరన్, సిమెంట్, కలప రంగాలలో వారికి చికాకులు తప్పవు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిదని గమనించండి. లీజు, ఏజెన్సీ, నూతన కాంట్రాక్టులు అనుకూలిస్తాయి. స్నేహ పరిచయాలు విస్త రిస్తాయి. **కర్కాటకం** : ఆహార వ్యవహారాలలో మెళుకువ వహించండి. ఉద్యోగస్తులకు పై అధికారుల నుంచి మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ యత్నాలకు సన్నిహితుల ప్రోత్సాహం, సహకారం అందిస్తారు. ఖర్చులకు సరిపడు ఆదాయం సమకూర్చుకుంటారు. **సింహం** : మీ ఆదాయానికి మించి ఖర్చులు అధికమవుతాయి. మీ సంతానం చదువుల్లో బాగా రాణిస్తారు. షేర్ మార్కెట్ రంగాల వారికి సామాన్యం. పండ్లు, పూలు, కూరగాయల వ్యాపారస్తులకు లాభదాయకం. **కన్య** : లిటిగేషన్ వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. ధనం సమయానికి అందుట వలన సంతృప్తి కానవస్తుంది. బంధుమిత్రులతో సంబంధ బాంధవ్యాలు బాగుగా ఉంటాయి. దైవ, పుణ్య, సేవా కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విద్యార్థులు ఉన్నత విద్యల కోసం చేసే యత్నాలు అను కూలిస్తాయి. ప్రయాణాలు అను కూలిస్తాయి. **తుల** : కందులు, ఎండుమిర్చి, స్టాకిస్టులు, వ్యాపారస్తులు సంతృప్తి కానవస్తుంది. రవాణా రంగాలలో వారికి మిశ్రమ ఫలితం కానవస్తుంది. రచయితలకు, పత్రికా రంగంలో వారికి కీర్తి, గౌరవాలు పెరుగుతాయి. ప్రేమాను బంధాలు బలపడతాయి. రాజకీయాల్లో వారికి తెలివితేటలకు మంచి గుర్తింపు లభిస్తుంది. **వృశ్చికం** : కుటుంబీకుల నుంచి సమస్యలు తలెత్తే ఆస్కారం ఉంది. ఫ్యాన్సీ, సుగంధ ద్రవ్య, రసాయన వ్యాపారస్తులకు లాభదాయకం. ఉపాధ్యాయులు ఒత్తిడి సమస్యలకు లోనవు తారు. ఎదుటివారు మీకు సమఉజ్జీలేనని గ్రహించండి. గత అనుభవాలు జ్ఞప్తికి రాగలవు. రియల్ ఎస్టేట్ రంగాల వారికి నూతన వెంచర్లు అనుకూలిస్తాయి. **ధనుస్సు** : స్త్రీలకు నూతన వ్యక్తుల పరిచయం ఎంతో ఇబ్బంది కలిగిస్తుంది. మార్కెటింగ్ రంగాల్లో వారికి, పత్రికా, ప్రైవేటు సంస్థల్లో వారికి మార్పులు అనుకూలిస్తాయి. ఊహించని ఖర్చులు వల్ల స్వల్ప ఇబ్బందులు తప్పవు. విద్యార్థులకు అతి ఉత్సాహం వల్ల సమస్యలు తలెత్తుతాయి. **మకరం** : ఉపాధ్యాయులకు ఒక సమాచారం ఆసక్తి కలిగిస్తుంది. స్త్రీలు ప్రముఖుల సిఫార్సుతో దైవ దర్శనాలను త్వరగా ముగించుకుంటారు. నూతన అగ్రిమెంట్లు వాయిదా వెయ్యండి. శ్రమకు తగిన ఫలితం దక్కుతుంది. నిరుద్యోగులు భవిష్యత్ గురించి పథకాలు వేసిన సత్ఫలితాలు పొందుతారు. ఖర్చులు అధిక మవు తాయి. **కుంభం** : ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. చేపట్టిన పనులు మంద కొడిగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని బహుతమతులు అందజేస్తారు. రావలసిన డబ్బు చేతికి అందడం వల్ల ఆర్థిక ఇబ్బంది అంటూ ఉండదు. స్త్రీలు తేలికగా మోస పోయే ఆస్కారం కలదు. **మీనం** : ఆర్థిక విష యాల్లో ఒకడుగు ముందుకు వేస్తారు. కాంట్రాక్టర్లకు అధికా రులతో అవగాహన కుదరదు. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు, ప్లీడరు గుమస్తాలకు ఒడిదు డుకులు తప్పవు. కొంత మంది మీ సహాయం పొంది మిమ్మల్ని తక్కువ అంచనా వేయటం వల్ల ఆందోళనకు గురవుతారు.

## వైకాపా అసెంబ్లీ అభ్యర్థి తిప్పలనాగిరెడ్డి విజయం కోరుతూ ప్రత్యేక పూజలు



గాజువాక: వైకాపా గాజువాక అసెంబ్లీ అభ్యర్థి తిప్పలనాగిరెడ్డికి విజయం కోరుతూ వైకాపా శ్రేణులు ఆధ్వర్యంలో పెదగంట్యాడ గ్రామదేవత శ్రీశ్రీశ్రీ పెంటమాంభ అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలను, 101 కొబ్బరి కాయలను కొట్టారు. ఈ సంధర్భంగా వైకాపా నాయకులు దేవన్ మాట్లాడుతూ రాష్ట్రంలో వైకాపా అధ్యక్షుడు వైయస్‌జగన్ రాష్ట్రముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకరణ చేపట్టాలని, అలాగే గాజువాక నియోజక వర్గంలో వైకాపా అభ్యర్థి తిప్పల నాగిరెడ్డి విజయం సాధించాలని కోరుతూ ఈ ప్రత్యేక పూజలను నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో వైకాపా అధికారాన్ని చేపడుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేసారు. ఎగ్జిట్ పోల్స్ అన్నీ వైకాపాకు అనుకూలంగా వున్నాయని, ప్రజలందరూ వైకాపా వైపే ఉన్నారని అఖండ మేజార్టీతో రాష్ట్రంలో వైకాపా అధికారాన్ని చేపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకలు పల్లచినతల్లి, వంగల అప్పలరాజు, పిట్టారెడ్డి, మధుసూధనరెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, పెంటయ్యారెడ్డి, కొయ్యభారతి, మార్డపూడి పరదేశి తదితరులు పాల్గొన్నారు.

## కారులో ఊపిరాడక బాలుడు మృతి



సింథియా: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిదిలో కారులో ఊపిరాడక బంగారి ప్రేమ్‌కుమార్(7) అనే బాలుడు మృతి చెందాడు. సింథియా అమజరీపార్క్‌లో సోమవారం ఈ సంఘటన చోటు చేసుకుంది. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...... నేవల్ అమజరీ పార్క్‌లో నేవల్ ఆఫీసర్ వద్ద బంగారి వినోధ్‌కుమార్ పనిచేసుకుంటూ, నివాసం ఉంటున్నాడు. ఆఫీసర్ కారును క్లీన్ చేయడానికి తండ్రి వినోధ్‌కుమార్ వెళ్ళిగా, కొడుకు ప్రేమ్‌కుమార్ ఆట వస్తువులకోసం కారులోనికి వెళ్లాడు. ఇది గమనించని తండ్రి తన పని ముగించుకొని ఇంటికి వెళ్ళిపోగా కార్ లాక్ అవడంతో లోపల ఉన్న బాలుడుకి ఊపిరి ఆడక మృతిచెందాడు. కొంతసేపటి వరకు బాలుడు కనిపించలేదని వెతుకుతుండగా, విషయాన్ని గమనించిన ఆఫీసర్ భార్య మృతిని తండ్రి వినోద్‌కుమార్‌కు తెలియజేసింది. దీంతో మృతిని తల్లిదండ్రులు బోరున విలపించారు. సమాచారం తెలుసుకున్న మల్కాపురం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసునమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు సి.ఐ.లంకా బాస్కరరావు తెలిపారు.



## "మధుర వచస్వి" పుస్తకావిష్కరణ

విజయనగరం: అసమాన పద్య కవితా ధురీణుడు మానాప్రగడ శేషశాయి అని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ డాక్టర్ భువనగిరి శ్రీకృష్ణవేణి అన్నారు.

స్వర్గీయ మానాప్రగడ శేషశాయి జీవితవిశేషాలపై, ఆయన సాహిత్యంపై తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్ రూపొందించిన మధురవచస్వి అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించి మాట్లాడుతూ విజయనగర సాహితీలోకంలో వెలుగు పూలు పూయించిన సృజనామూర్తి శేషశాయి అని, ఆయన అందమైన మాటలతో పద్యాలను పరవళ్లు తొక్కించారని భాషా వాఙ్మయ సరస్వతీమాత ఆత్మతో శేషశాయి సాధించిన స్వభావ అద్వైత స్థితికి శాశ్వత సజీవ స్వరూపం ఆయన సృష్టించిన సాహిత్యమని, ఆయన రాసిన పద్యాలు నిత్యనూతన తరుణారుణ కిరణాలతో పులకింపచేసాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో మానాప్రగడ సాహితి, రచయిత గురుప్రసాద్, ఉత్త రాంధ్ర రవాణా శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కృష్ణమోహన్, పరిపాలనాధికారి సత్యారావు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిన్నీస్ రికార్డులో భారీ శాకాహార ఇఫ్తార్ విందు

అబుదాభి : ముస్లింలకు ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో అత్యంత పెద్దదైన ఇఫ్తార్ కార్యక్రమాన్ని అబుదాబిలో నిర్వహించి గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించాడు ఓ భారతీయుడు. వివరాల్లోకి.. వెళితే జోగిందర్ సింగ్ సాలరియా అనే వ్యక్తి పెహల్ ఛారిటబుల్ ట్రస్టును స్థాపించి స్వచ్ఛంద సేవ చేస్తున్నారు. అందులో భాగంగానే రంజాన్ మాసం పొడవునా దుబాయ్ ఇండ్రస్ట్రియల్‌పార్క్‌లోని తన పరిశ్రమ పెహల్ ఇంటర్నేషనల్ ప్రాంగణంలో శాకాహారంతో కూడిన ఇఫ్తార్ విందును అందిస్తున్నారు.

# చలివేంద్రం ప్రారంభం



విశాఖపట్నం : భారత్ వికాస్ పరిషత్ విశాఖ నగర శాఖ మరియు యలయెన్స్ నార్త్ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ దరి, రఘు టవర్స్ మెయిన్ రోడ్డులో చలివేంద్రం ఏర్పాటు చేయడమైనది. ఈ చలివేంద్రాన్ని భారత్ వికాస్ పరిషత్ నగర శాఖ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ వేడి నుండి పాదచారులకు ఉపసమనాన్ని కలిగించే చల్లని మజ్జిగతో కూడిన చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. సేవతోనే మనిషికి ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. యలయెన్స్ నార్త్ ఈస్ట్ అధ్యక్షులు కె.మధుబాబు ఈ చలివేంద్రం వారం రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ కార్యదర్శి ఎస్.సోమరాజు, యలయెన్స్ ఉమెన్ డెవలప్‌మెంట్ జె.అనురాధ, యలయెన్స్ కార్యదర్శి చంద్రశేఖర్, యలయెన్స్ కోశాధికారి జె.లక్ష్మణరావు, యలయెన్స్ డి.సి.పి. సిహెచ్.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. చలివేంద్రానికి చక్కని స్పందన లభిస్తుంది.

# మైనార్టీలకు విద్య.. మహదవకాశం : మైనార్టీసంక్షేమ అధికారి అన్నపూర్ణమ్మ

విజయనగరం: పదవతరగతిలో ఏడు గ్రేడ్లు పాయింట్లు, ఆపై పొందిన మైనారిటీ విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల్లో ప్రవేశాలకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఎం.అన్నపూర్ణమ్మ తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బూద్ధులు, జైనులు పార్శీ విద్యర్థులు ఈ అవకాశం వినియోగించుకోచ్చని తెలిపారు. కాలేజీలో చేరినప్పటినుంచి రెండేళ్ళ వరకు వారి బాధ్యత పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుదని తెలిపారు. ఏకరూప దుస్తులు, పుస్తకాలు, రుసుము, వసతి ఇంటర్‌తోపాటు ఎంసెట్లో ఉచిత శిక్షణ అందిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ శాఖల ద్వారా ప్రభుత్వ, పురపాలక, జెడ్పీ, ఎయిడెడ్, పాఠశాల విద్యార్థులు, సంక్షేమ గురుకుల పాఠశాల, జవహర్ నవోదయ, సంక్షేమ వసతిగృహాలు, ఆశ్రమ పాఠశాలలు, కె.జి.బి.వి., బెస్ట్ లవైలబుల్ పాఠశాల విద్యార్థులు ఈ అవకాశం పొందవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం లక్ష రూ.లు మించరాదన్నారు. ఈనెల 18వ తేదీ నుండి 31వ తేదీ వరకు దరఖాస్తులు http:jnanabhumi.ap.gov.in చేసుకోవచ్చని తెలిపారు. మీసేవ నుంచి పొందిన ఆదాయ, కుల జనన, వికలాంగ, ఆధార్కఆర్డు, సమాచారం కోసం చరవాణీ కేంరదం, ఈ మెయిల్ ఐడిపొందుపర్చాలన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలల్లో ఉన్నత విద్యకు మైనార్టీ శాఖ నుంచి ఎంపికూన అభ్యర్థులు 15 లక్షలు గ్రాంట్ రూపంలో అందుకుంటారని తెలిపారు. పిజి, పిహెచ్‌డి, ఎంబిబిఎస్ కోర్సులకు ఆ పథకం వర్తిస్తుందన్నారు. అయితే అనుమతి ఉన్న యుఎస్ఐ, యు.కె, ఆస్ట్రేలియ, కెనడా, సింగపూర్, జర్మనీ, న్యూజిలాండ్, స్వీడన్, నెధర్‌లాండ్, ప్రాన్స్, డెన్మార్క్, రష్యా, ఫిలిఫిన్ ఖజికిస్థాన్, చైనా, జపాన్ దేశాల్లోనే విద్యావకాశం ఉంటుందన్నారు. అభ్యర్థులకు తప్పనిసరి పాస్‌పోర్ట్ ,వీసా పొందిన దేశంలోనే విద్యావకాశం ఉంటుందని తెలిపారు. మీసేవ నుంచి పొందిపన ధృవపత్రాలు జత చేయాలని తెలిపారు. క్వాలిఫైయింగ్ కోర్సు ధృవపత్రంతో పాటు టోఫెల్, ఐ.ఈ.ఎల్టీఎస్ స్కోర్ కార్డ్, ఏదైనా జాతీయ బ్యాంకు లో అకౌంటు ఉండాలన్నారు. ఇతర వివరాలకు http: apepass.cgg.gov.in వెబ్‌లో చూడవచ్చనని తెలిపారు. పోస్ట్‌మెట్రిక్ వసతి గృహాలకు శాఖ ద్వారా మూడు మైనార్టీ బాలికల ఉచిత వసతి గృహం (అనంతపురం, కర్నూల్, గుంటూరు), మరో మూడు ప్రీ మెట్రిక్ గృహాలు (కృష్ణ, చిత్తూరు, కడప) లో నడుపుతున్నామని పేర్కొన్నారు. బాలికల గురుకుల పాఠశాలలు విజయవాడ, చిత్తూరు, కర్నూలు, గుంటూరులో బాలురవి మచిలీపట్నం, నెల్లూరు,అనంతపురంలో నడుపుతున్నామని తెలియ జేశారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కంప్యూటర్, సామగ్రి మాయం

నర్సీపట్నం : నర్సీపట్నం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో కంప్యూటర్లు, సిపియు వంటి పరికరాలను మాయమయ్యాయి. కళాశాల చింతపల్లి రోడ్డులోని ఆనుకొని ఉన్న ఈ కళాశాలలో. దుర్గనాయుడు అనే పార్ట్‌టైమ్ ఓచర్ కళాశాలలో ఇంటర్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జరుగుతున్నందున ఉదయం 7 గంటలకు కళాశాలకు వచ్చేసరికి ఆఫీసు తలుపు గడియ తెరచి ఉన్నట్లు గుర్తించారు. ఈవిషయం వెంటనే ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.గంగరాజుకు ఫోన్ ద్వారా తెలిపారు. గంగరాజు షిర్డి ప్రయాణంలో ఉన్న కారణంగా ఆఫీసులోని సీనియర్ అసిస్టెంట్‌గా ఉన్న యశోదదేవికి ఈ విషయాన్ని తెలియజేశారు. వెంటనే ఆమె వెళ్లి చూడగా ఆఫీసులో గల రెండు కంప్యూటర్ మోనిటర్లు, ఒక సిపియు, రెండు సిపిఎస్‌లు, ఒక ఇంటర్నెట్ బిఎస్ఎన్ఎల్ మోడెం, ఒకటి బీరువాలో గల స్కానర్, మరొకటి బయోమెట్రిక్ కనక్ట్ మోడెం, అలాగే సిసి టీవీ, కంప్యూటర్, మోనిటర్,సిసి టీవీ మోడెం సెట్ అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు..

## ఎన్ఎండీసీ చేతికి ఆస్ట్రేలియా కంపెనీ

హైదరాబాద్: ప్రభుత్వరంగ మైనింగ్ దిగ్గజం ఎన్ఎండీసీ..ఆస్ట్రేలియాకు చెందిన లెగసీ ఐరన్‌ను హస్తగతం చేసుకోవాలని చూస్తున్నది. ఇప్పటికే 76 శాతం వాటాను కొనుగోలు చేసిన ఎన్ఎండీసీ..తాజాగా మి గతా 24 శాతం వాటాను కొనుగోలు చేయడానికి ప్రయత్నాలను ముమ్మరం చేసింది. దీంతో ఆస్ట్రేలియా స్టాక్ ఎక్స్ఛేంజ్(ఏఎస్ఎక్స్) నుంచి డీలిస్టింగ్ చేయాలనుకుంటున్నట్లు ఎన్ఎండీసీ డైరెక్టర్(ఫైనాన్స్) అమితావ ముఖర్జీ తెలిపారు. ఆస్ట్రేలియాలోని పెర్థ్ కేంద్రస్థానంగా విధులు నిర్వహిస్తున్న లెగసీ ఐరన్ ఓర్ లిమిటెడ్..ఖనిజంతోపాటు బంగారం, బేస్ మెటల్‌లను వెలక్కితీస్తున్నది. లెగసీ గోల్డ్ ప్రాజెక్టులను మరింత అభివృద్ధి పరుచడానికి మరో 10 మిలియన్ల ఏయూడీ(ఆస్ట్రేలియన్ డాలర్) పెట్టుబడి పెట్టేయోచనలో సంస్థ ఉందన్నా రు. ఇప్పటికే సంస్థలో మెజా ర్టీ వాటాదారులమైన మే ము..మిగతా వాటాను కొనుగోలు చేసి హస్తగతం చేసుకోవాలని చూస్తున్నట్లు పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. ఏఎస్ఎక్స్ లిస్టైన లెగసీ ఐరన్ ఓర్‌లో 2011లోనే ఎన్ఎండీ 50 శాతం వాటాను కొనుగోలు చేయడానికి 19 మిలియన్ ఏ యూడీలను పెట్టుబడిగా పెట్టింది. ఆ తర్వాతి క్రమంలో ఈ వాటాను 76 శాతానికి పెంచుకున్నది. ఖర్చులను తగ్గించుకోవడంలో భాగం గా సంస్థను అక్కడి స్టాక్ మార్కెట్ నుంచి వైదొలుగాలనుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

పశ్చిమ ఆస్ట్రేలియాలో సంస్థకు 19 గనులను నిర్వహిస్తున్నది. వీటిలో ఇనుప ఖనిజంతోపాటు బంగారాన్ని తయారు చేస్తున్నది.

## అర్ధరాత్రి ఉదయించే సూర్యుడు
# సిరివెన్నెల సీతారామశాస్త్రి



ప్రపంచమంతా పడుకున్న తర్వాత ఆయన నిద్ర లేస్తాడు.. ఆయన రాత్రి ఉదయించే సూర్యుడు.. అర్ధరాత్రి ఉదయించే సూర్యుడు.. ఆయన పదాలు అనే కిరణాలు.. అక్షరాలు అనే తూటాలు తీసుకుని, ప్రపంచం మీదకు వేటకు బయలుదేరతాడు. మనం సమాధానం చెప్పలేని ప్రశ్నలను సంధిస్తాడు. ఓటమిని ఎప్పుడూ ఒప్పుకోవద్దని అంటాడు.. ఆయనే తెలుగు సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి. సోమవారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఓ కార్యక్రమంలో సీతారామశాస్త్రి గొప్పతనం గురించి ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ చెప్పిన మాటలు...

సీతారామశాస్త్రిగారి కవిత్వం గురించి చెప్పడానికి నాకున్న శక్తి సరిపోదు. నాకున్న పదాలు సరిపోవు. ఎందుకంటే ఆయన తొలి సినిమా సిరివెన్నెలలో రాసిన ప్రాగ్దిశ వేణియ పైన.. దినకర మయూఖ తంత్రులపైన ఆ పాట విన్న వెంటనే తెలుగు డిక్షనరీ ఒకటి ఉంటుందని తెలిసింది. దాన్ని శబ్ద రత్నాకరం అంటారని తెలుసుకున్నా. అది కొనుక్కుని వచ్చి, ప్రాగ్దిశ అంటే ఏంటి? మయూఖం అంటే ఏంటి? లాంటి విషయాలన్నీ తెలుసుకున్నా. ఒక పాటను అర్థమయ్యేలాగానే రాయనక్కర్లేదు. అర్థం చేసుకోవాలని అనే కోరిక పుట్టేలా రాయొచ్చు అని తెలుగు పాట స్థాయిని పెంచిన వ్యక్తి. ప్రేక్షకులు ఇవే చూస్తున్నారు. ఇవే అర్థం అవుతాయని కాకుండా, వారికి అర్థం చేసుకోవాలనే తపన ఉంటుంది. ఏదో భీమవరంలాంటి ఊళ్లో, శాఖా గ్రంథాలయలాంటి రెండు గదులున్న ఒక లైబ్రరీలో ఒక నిఘంటువును ఒక కుర్రాడు వెతుక్కుని, అందులో అర్థం తెలుసుకుని, ఆరోజు తృప్తితో పడుకుంటాడు.. అలాంటి పాట ఏదో ఇంకొకటి రాయాలి అని ఆసక్తి రేకెత్తించగల స్థాయి ఉన్న కవి. ఎందుకంటే, బాలగంగాధర్ తిలక్ అమృతం కురిసిన రాత్రి, శ్రీశ్రీ మహా ప్రస్థానం, కొంపల్లి జనార్దన్ రాసిన ఇదిగో ఇక్కడ నిలబడి ఆవాహన చేస్తున్నా. అందుకో ఈ చాచిన హస్తం వంటివి రాయాలంటే చాలా ధైర్యం కావాలి. ఆవాహన అనే మాట వాడటానికి చాలా శక్తి కావాలి. అలాంటి మాట పుస్తకంలో రాయడానికే కష్టమంటే, అలాంటి మాటలను అలవోకగా సినిమా పాటకు తీసుకొచ్చి, ప్రేక్షకుడి స్థాయిని పెంచిన కవి

చిరంజీవిగారిని చూడగానే ఈలలు వేస్తాం. చప్పట్లు కొడతాం. ఆయన నటించిన సినిమాలో తరలిరాద తనే వసంతం.. తన దరికి రాని వనాల కోసం అని రాయడానికి సీతారామశాస్త్రిగారికి ఎంత గట్స్ ఉండాలి. అది దర్శకుడిని ఒప్పించడానికి, అది ప్రొడ్యూసర్‌తో సినిమాలో పెట్టించడానికి ఎంత ధైర్యం ఉండాలో ఒక దర్శకుడిగా నాకు తెలుసు. బొబ్బిలిరాజా సినిమాలో బలపం పట్టి భామ బళ్లో.. పాట అందరం వింటాం.. అందులో కొమ్మల్లో కుకూలు.. కొండల్లో ఎకోలు.. ఎకో అంటే ప్రతిధ్వని.. అలాంటి కవిత్వాన్ని వెంకటేశ్-దివ్యభారతిల డ్యూయెట్‌లో రాయడం ఆయనకే సాధ్యమైంది. కమర్షియల్ సినిమా అంటే దిగజారుడు సాహిత్యం, అర్థం పర్థంలేని పదాలతో కలిసి పాటలు అన్న ఇమేజ్‌ను చెరిపేశారు. హీరోల తాలూకు ఇమేజ్, దర్శకుల తాలూకూ అర్థంలేని తనం, ప్రొడ్యూసర్‌ల వ్యాపార విలువలు.. ప్రేక్షకుల తాలుకూ అర్థం చేసుకోలేని తనం వీటన్నింటి మధ్యలో కూడా ఒక గొప్ప పాట ఇవ్వడానికి రాత్రిళ్లు ఆయన టేబుల్‌పైన ఖర్చు పెట్టిన క్షణాలు.. ఖర్చు చేసుకున్న జీవితం.. వదులుకున్న కుటుంబం.. ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రపంచమంతా పడుకున్న తర్వాత ఆయన లేస్తాడు.. ఆయన రాత్రి ఉదయించే సూర్యుడు.. అర్ధరాత్రి ఉదయించే సూర్యుడు.. ఆయన పదాలు అనే కిరణాలు.. అక్షరాలు అనే తూటాలు తీసుకుని, ప్రపంచం మీదకు వేటకు బయలుదేరతాడు. మనం సమాధానం చెప్పలేని ప్రశ్నలను సంధిస్తాడు. ఓటమిని ఎప్పుడూ ఒప్పుకోవద్దని అంటాడు.

హైదరాబాద్ వచ్చిన కొత్తలో నేను సింధూరం సినిమాకు వెళ్లాను. తినడానికే డబ్బులు లేని సమయం. టికెట్ కొనుక్కోవడానికి కష్టమైన రోజుల్లో ఆ సినిమాకు వెళ్లా. సినిమా అంతా అయిపోయిన తర్వాత ఏదో అసంతృప్తి ఉంది. చివర్లో అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్నే స్వతంత్రమందామా.. ఆ ఒక్కమాటతో లేచి, రెండు జేబుల్లో చేతులు పెట్టుకుని, నేను నడుచుకుంటూ వెళ్లిపోతున్నా. నేను ఎక్కడకి వెళ్తున్నానో నాకే తెలియడం లేదు. ఒక మనిషిని ఇంతలా కదిలించే శక్తి సాహిత్యానికి మాత్రమే ఉంటుంది. మీ అందరికీ ఒక నిజం చెబుతా. ఆయన సినిమా కవి కావడం వల్లే.. ముఖ్యంగా తెలుగు సినిమా కవి అవ్వడం మూలంగా ఇక్కడ మిగిలిపోయాడేమోనని బాధగా ఉంది. ఆయన సినిమా పాటలు రాసినందుకు నిజంగా చింతిస్తున్నా. ఎందుకంటే.. సినిమా పాటకు సాహిత్య విలువ లేదు.

# చిత్రభాను

# ఒకరిని ఫాలో కావడం నా నైజం కాదు!



**వెండితెర నిండు చందమామ కాజల్. పుష్కరకాలంగా తనదైన సోయగంతో తళు కులీనుతోంది. వన్నెతరగని సౌందర్యం, చూడచక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పిస్తున్నది. ఈ ప్రయాణాన్ని నేను పరిపూర్ణంగా ఆస్వాదిస్తున్నాను. నేను కోరుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాననే సంతృప్తి ఉంది అని తనకెరీర్ గురించి సంతోషాన్ని వ్యక్తం చేసింది కాజల్. ఆమె కథానాయికగా నటించిన తాజా చిత్రం సీత. తేజ దర్శకుడు. ఈ నెల 24న ప్రేక్షకులముందుకురానుంది. ఈ సందర్భంగా కాజల్ అగర్వాల్ పాత్రికేయులతో సంభాషించింది. ఆమె చెప్పిన ముచ్చట్లివి...**

**సినిమాలో మీరు పోషిస్తున్న పాత్రను అభినవ సీతగా అభివర్ణించవొచ్చా?**

-నా పాత్రలో పౌరాణిక సీత లక్షణాలు ఏమీ కనిపించవు. లక్ష్యం కోసం తపించే ఓ ఆధునిక యువతి కథ ఇది. మానవ సంబంధాలు, వాటితో పెనవేసుకుపోయిన అహం సమస్యలు ప్రధానంగా సాగుతుంది. ప్రతి ఒక్కరికి వ్యక్తిగత ప్రాధామ్యాలు ఉంటాయి. వాటిని సాధించడానికి ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటుంటారు. సీత తన కలల సాధనకు ఏం చేసిందన్నది ఆసక్తికరంగా ఉంటుంది.

**దర్శకుడు తేజతో కలిసి మూడో సినిమా చేయడం ఎలాంటి అనుభూతినిచ్చింది?**

-తేజగారంటే నాకెంతో గౌరవం. ఈ సినిమా ఎప్పుడో చేయాల్సింది. అనుకోని కారణాల వల్ల కుదరలేదు.

**సీత పాత్ర చిత్రణలో మీకు నచ్చిన అంశాలేమిటి?**

-నేటి మహిళకు ప్రతినిధిగా నా పాత్ర చిత్రణ ఉంటుంది. సీత గీసిందే గీత.. అని సినిమాలో ఓ సంభాషణ ఉంటుంది. అందులోనే సీత వ్యక్తిత్వం మొత్తాన్ని అర్థం చేసుకోవచ్చు. ఎట్టి పరిస్థితుల్లో తనదే పై చేయి కావాలనే మనస్తత్వమున్న యువతి ప్రయాణమిది. అయితే వ్యక్తిగతంగా సీతలోని కొన్ని లక్షణాల్ని నేను కూడా ఇష్టపడను (నవ్వుతూ).

**మీ పాత్రలో నెగెటివ్ షేడ్స్ ఉంటాయని అంటున్నారు?**

-అలాంటిదేమి లేదు. అభిమానానికి, అహంకారానికి సన్నని విభజనరేఖ ఉంటుంది. సీత ఆ గీత దాటదు. ఎదుటివారికి నష్టం చేయకుండానే తన పంతాన్ని నెగ్గించుకుంటుంది. నా పాత్ర చిత్రణలో భిన్న పార్శ్వాలు కనిపిస్తాయి. కథలో సంక్లిష్టత, అనూహ్య మలుపులు ఉంటాయి.

**మీ సమకాలీన కథానాయికలు మహిళా ప్రధాన చిత్రాల్లో నటిస్తున్నారు. మీరు అటువైపు దృష్టిపెట్టకపోవడానికి కారణమేమిటి?**

-ఏ విషయంలోనైనా మరొకరితో పోల్చిచూడటం నాకు అస్సలు ఇష్టం ఉండదు. ఎవరో ఏదో చేస్తున్నారని వారిని ఫాలో అయిపోవడం నా నైజం కాదు. కథ నచ్చితే మహిళా ప్రధాన చిత్రాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాను. నన్ను నేను శక్తివంతమైన పాత్రల్లో ఆవిష్కరించుకోవాలనే తపనతో కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటున్నాను.

**మను చరిత్ర సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నారు. భవిష్యత్తులో నిర్మాణరంగంలోకి అడుగుపెట్టే ఉద్దేశ్యం ఉందా?**

-ఓ బ్యానర్‌ను మొదలుపెడదామనే ఆలోచన ఉండేది. ప్రస్తుతం దానిని పక్కనపెట్టాను. సినిమాల మీదే దృష్టిపెడుతున్నాను. భవిష్యత్తులో నిర్మాణ బాధ్యతలు తీసుకునే అంశాన్ని తోసిపుచ్చలేం.

**మీరు అరకులోయలో నడిపిస్తున్న స్కూల్ ఎలా పనిచేస్తున్నది?**

-సీత షుటింగ్ సందర్భంగా జనవరిలో అరకులోని స్కూల్‌ను సందర్శించాను. అక్కడ విద్యతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలకు పెద్దపీట వేస్తున్నాం. ఆ పాఠశాలను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తాను.

**ఇండియన్-2 సినిమా ఎంతవరకు వచ్చింది?**

-ప్రస్తుతం కమల్‌హాసన్‌గారు రాజకీయాల్లో బిజీగా ఉన్నారు. దాంతో షుటింగ్‌కు విరామం వచ్చింది. వచ్చే నెలలో తిరిగి సెట్స్‌లోకి అడుగుపెడతాను. ఇక క్వీన్ తమిళ రీమేక్ పారిస్ పారిస్ చిత్రీకరణ పూర్తయింది. అందులో నా పాత్ర ఎంతగానో నచ్చింది. ఆ సినిమా విడుదల కోసం ఎదురుచూస్తున్నాను. తమిళంలో జయం రవితో చేస్తున్న సినిమా కూడా చిత్రీకరణ పూర్తయింది.

-ఈ సినిమా కోసం ఎన్నో సాహసాలు చేశాను. ఓ సీన్‌లో దాదాపు 200 కేజిల బరువున్న మంచు ముక్కల్ని శరీరంపై వేసుకొని నటించాను. కొన్ని పోరాట ఘట్టాల్లో కూడా నటించాను. వాటివల్ల శరీరంపై కొన్ని గాయాలయ్యాయి. ఎంతో శ్రమతో సినిమా చేశాను.

# విజయ్ దేవరకొండ హీరో షురూ!



క్రేజీ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ నటిస్తున్న మరో చిత్రం హీరో చిత్రీకరణ హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. అన్నామలై దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మాళవికా మోహనన్ కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం విజయ్ దేవరకొండ, మాళవిక మోహనన్‌లపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి దర్శకుడు కొరటాల శివ క్లాప్ నిచ్చారు. ఎమ్మెల్యే రవికుమార్ కెమెరా స్విఛాన్ చేశారు. క్రీడా నేపథ్యంలో సాగే మ్యూజికల్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ చిత్రం ద్వారా తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో నటించి పేరుతెచ్చుకున్న మాళవిక మోహనన్ తెలుగు చిత్రసీమలో కథానాయికగా అరంగేట్రం చేస్తున్నారు. విజయ్ దేవరకొండ తొలిసారిగా డిఫరెంట్ జోనర్‌లో నటిస్తున్న చిత్రమిది. ఆయన పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది అని చిత్ర బృందం పేర్కొంది. దిగంత్ మచాలే, వెన్నెల కిషోర్, సరన్ శక్తి, రాజా కృష్ణమూర్తి, జాన్ ఎడా తట్టిల్ తదితరులు నటిస్తున్నారు. చిత్రానికి కెమెరా: మురళీ గోవిందరాజులు, సంగీతం: ప్రదీప్ కుమార్, ప్రొడక్షన్ డిజైనర్స్ మౌనిక, రామకృష్ణ, స్టంట్: శంకర్ ఉయ్యాల, వీఎఫ్ఎక్స్: యుగంధర్.టి.

# అత్యంత వైభవంగా పుష్పయాగం



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల చివరి రోజు వైశాఖ బహుళ పాడ్యమి ఆదివారం రాత్రి సత్యదేవుని శ్రీపుష్పయాగ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసిన నిత్య కళ్యాణ మండపానికి సత్యదేవుడు, అమ్మవార్లను, పెళ్లిపెద్దలు అయిన సీతారాములను ఊరేగింపుగా రాత్రి 7.30 గంటలకు తీసుకువచ్చారు. అక్కడ గల వెండి సింహాసనం మీద స్వామి అమ్మవార్లను, ఆ సింహాసనం పక్కనే గల మరో ఆసనం మీద పెళ్లిపెద్దలు అయిన సీతారాములను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం పుష్పయాగం కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత విఘ్నేశ్వరపూజ చేశారు. అనంతరం పుణ్యాహవచనం మంత్రాలను పఠించారు. తరువాత పండితులు గర్భాదానం కార్యక్రమానికి సంబంధించిన పూజలు నిర్వహించారు. తరువాత సర్వాంగసుందరంగా అలంకరించిన ఊయల మీద పవళించిన విష్ణుమూర్తి, లక్ష్మీదేవి అవతారంలో సత్యదేవుడు, అమ్మవార్లను అలంకరించి పూజలు చేశారు. వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలతో సుమారు గంట సేపు అర్చన చేసారు. అనంతరం అనేకమైన విశేష పదార్థాలను నివేదించి దంపతులకు దంపతీ తాంబూలాలు నివేదించారు.

ప్రత్యేక పూజలు అనంతరం సుగంధభరిత పుష్పాలతో తయారు చేసిన ఊగుటూయలలో శేషపాన్పుపై శయనించే విష్ణుమూర్తిగా సత్యదేవుడున్ని అలంకరించారు. ఆయన పాదాలు సుతిమెత్తగా ఒత్తుతున్నట్లు దేవేరి అనంతలక్ష్మి అమ్మవారిని అలంకరించి అర్చక స్వాములు ఊంజల్ సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన మహిళలందరికీ రవికెలగుడ్డలను, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. వేదపండితులు కపిలవాయి రామశాస్త్రి, ముష్టి కామశాస్త్రి, ప్రధానార్చకులు కొండవీటి సత్యనారాయణ, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు నాగాభట్ల. కామేశ్వరశర్మ, ముత్య సత్యనారాయణ, చామర్తి కన్నబాబు ఇతర అర్చకస్వాములు, పురోహితులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రెవిన్యూ ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ మన్మోహన్ సింగ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎం.వి. సురేష్ బాబు, చైర్మెన్ ఐవి. రోహిత్, పాలక మండలి సభ్యులు మట్టే సత్య ప్రసాద్, ఏసి ఈరంకి జగన్నాథరావు, పిఆర్వో తులా రాముడు, దేవస్థానం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కార్యకర్తలందరూ
# అప్రమత్తంగా ఉండాలి

- ఎవరు ఇబ్బంది పెట్టినా శాంతియుతంగా పనిచేయాలి
- వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు



విశాఖ సిటీ : గత నెల 11న జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు లెక్కింపు ప్రక్రియ ఈ నెల 23న జరుగనున్న నేపధ్యంలో ఆ రోజు ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్ సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం సీతమ్మధార బాలయ్య శాస్త్రి లేఔట్‌లో గల ఉత్తర నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు.

ఈ కార్యక్రమంలో కేకే రాజు మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన జరగబోయే కౌంటింగ్ ప్రక్రియ కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు, ఏజెంట్లు ఇబ్బందులు పెట్టినట్లయితే మనందరం అప్రమత్తంగా ఉండి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి, శాంతియుతంగా పనిచేయాలని కేకే రాజు సూచించారు. ప్రత్యర్థ పార్టీ వారు ఓటమి భయంతో అవాకులు చవాకులు చేస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడు తుంటారని, అయనా ధైర్యం కోల్పోకుండా సమన్వయంతో ఉండాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకటరావు, రొంగలి జగన్నాథం, సనపల చంద్రమౌళి, సత్తి రామకృష్ణారెడ్డి, కె.వి. బాబా, సేనాపతి అప్పారావు, సదరము చిన్నఅప్పారావు, పోతు సత్యనారాయణ, వార్డు ప్రెసిడెంట్లు, సిటీ నాయకులు, పార్లమెంటు నాయకులు, మహిళా నాయకులు పద్మారెడ్డి, కల్చరల్ విభాగం రాధ , రామలక్ష్మి మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి భయంతోనే అధికార పార్టీ నాయకుల దాడులు

**వైకాపా సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకటరావు**



ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకటరావు మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని, ఇప్పటికే అనేక ప్రచార మధ్యామాల ద్వారా వైకాపా శ్రేణులను బెదిరింపులకు గురిచేస్తున్నారని, అయినా కార్యకర్తలందరూ సంయమనం పాటించాలని చొక్కాకుల పిలుపునిచ్చారు.

ఏదిఏమానా 23వ తేదీన వెలువడనున్న ఫలితాలలో వైకాపా విజయం తథ్యమని, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా కేకే రాజు భారీ మెజార్టీతో గెలుపొందుతారని చొక్కాకుల ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగురవేస్తుందని, మరికొద్ది రోజుల్లో జననేత జగన్మోనహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసే రోజు దగ్గరలోనే ఉందని చొక్కాకుల జోస్యం పలికారు. అనంతరం రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు కేకే రాజును మతసాంప్రదాయం ప్రకారంగా టోపీ పెట్టి, దుశ్శాలువతో సత్కరించారు.

# ఎగ్జిట్‌పోల్స్ పట్టించుకోను

- గెలిచినా.. ఓడినా.. ప్రజాసేవలోనే ఉంటా
- రంజాన్ తోఫా పంపిణీ
- సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ



విశాఖపట్నం: రాష్ట్రంలో జనసేన ప్రభావం పెద్దగా ఏమీ లేదని, ఆ పార్టీకి చాలా స్వల్పంగా మాత్రమే సీట్లు వస్తాయంటోన్న పలు సంస్థల ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై జనసేన విశాఖ లోక్‌సభ అభ్యర్థి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ స్పందించారు. ఎగ్జిట్ పోల్స్‌ను తాను పట్టించుకోనన్నారు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా నిత్యం ప్రజాసేవలోనే ఉంటానని స్పష్టంచేశారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను చూసి ఆందోళన చెందకుండా ఈ నెల 23వరకు వేచి చూడాలని ఆయన ప్రజలకు సూచించారు.

విశాఖ వన్‌టౌన్‌లో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎగ్జిట్ పోల్స్‌తో మాకేమీ ఆందోళన లేదు. అనవసరంగా ఎగ్జిట్ పోల్స్ ఇచ్చి ప్రజల్లో మరింత ఉత్కంఠ కల్గిస్తున్నారు. ఓపికతో ఉంటే ఈ నెల 23న అసలు ఫలితమే వచ్చేస్తుంది. ఏ ఫలితం వచ్చినా ప్రజా సమస్యలపై పోరాడాలని మా పార్టీ నిర్ణయించింది. గెలుపోటములు సహజం. ప్రజల కోసం పనిచేయాలన్న భావనతో మేం ముందుకెళ్తున్నాం. అందువల్ల ఎగ్జిట్ పోల్స్ వల్ల కలిగే ప్రభావం మాపై ఏమీ కనబడటంలేదు అన్నారు.



# మరోసారి హైకోర్టుకు రవిప్రకాశ్

హైదరాబాద్: ఫోర్జరీ, డేటా చౌర్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్ మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. తనపై సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నమోదు చేసిన కేసులపై ముందుస్తు బెయిల్ ముంజూరు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన తరపు న్యాయవాది దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం విచారించనుంది. కాగా ముందుస్తు బెయిల్ కోసం ఇదివరకే ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే.

కాగా నిధుల మళ్లింపు, ఫోర్జరీకి పాల్పడి ఇప్పటికే అజ్ఞాతంలో ఉన్న రవిప్రకాశ్‌పై సైబరాబాద్ పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దేశం విడిచి పారిపోకుండా ఉండేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. కాగా ఇప్పటికే రవిప్రకాశ్ పాస్‌పోర్టును పోలీసులు సీజ్ చేసిన విషయం విదితమే.






# వడ్డీవ్యాపారులపై కొరడా

## 49మంది అరెస్టు .. రూ. 65.52 లక్షల నగదు స్వాధీనం

## నగర పోలీస్ కమిషనర్ సత్యనారాయణ



గోదావరిఖని: వడ్డీ వ్యాపారులపై రామగుండం పోలీసులు కొరడా ఝుళిపించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 49 మంది వడ్డీ వ్యాపారుల్ని అరెస్టు చేసినట్టు రామగుండం నగర పోలీస్ కమిషనర్ సత్యనారాయణ వెల్లడించారు. అక్రమంగా వడ్డీ వ్యాపారం చేస్తున్నవారిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.65.52లక్షల నగదు, బాండ్ పేపర్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఖాళీ చెక్కులు, ఏటీఎం కార్డులు, పట్టాదారు పాసు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మరో 70 మంది వడ్డీ వ్యాపారులు పరారీలో ఉన్నట్టు సీపీ వెల్లడించారు.

గోదావరిఖనిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. రామగుండంలో వడ్డీ వ్యాపారులు అక్రమంగా అధిక వడ్డీలకు ఫైనాన్స్ చేస్తూ లాభార్జనకు పాల్పడుతున్నారని వివరించారు. ప్రాంసరీ నోట్లు, బాండ్ పేపర్లు రాయించుకోవడంతో పాటు ఏటీఎం కార్డులు, పట్టా పాసుపుస్తకాలు వారి వద్ద తనఖా పెట్టుకొని అప్పులు ఇస్తున్నారని తెలిపారు. ఈ రెండు జిల్లాల్లో అక్రమంగా నడుపుతున్న వడ్డీ వ్యాపారులపై ఏకకాలంలో దాడులు నిర్వహించి 1235 ప్రాంసరీ నోట్లు, 1019 బ్లాంక్ చెక్కులు, 347 ఏటీఎం కార్డులు, 175 బాండ్ పేపర్లు, 23 భూమి పత్రాలు, 9 పట్టాదారు పాసు పుస్తకాలు వారి నుంచి స్వాధీనం చేసుకున్నామని వివరించారు.

అధిక వడ్డీలకు అప్పులు ఇస్తూ అనుమతి లేని వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డీసీపీలు సుదర్శన్, రక్షిత కృష్ణమూర్తి, అదనపు డీసీపీలు అశోక్ కుమార్, రవికుమార్, ఏసీపీలు పాల్గొన్నారు.

## వివేకా హత్యకేసు నిందితులకు రిమాండ్‌పాడిగింపు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులకు కోర్టు మరోసారి రిమాండ్ పొడిగించింది. ఈ హత్యకేసులో అరెస్టైన ఎర్ర గంగిరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రకాశ్‌లను పులివెందులలోని జూనియర్ సివిల్ కోర్టులో పోలీసులు సోమవారం హాజరుపరిచారు. ఈ మేరకు కోర్టు జడ్జి అశోక్ కుమార్ నిందితులకు జూన్ 3 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీచేశారు. అలాగే, కడపలోని కేంద్ర కారాగారం నుంచి పులివెందులలోని సబ్ జైలుకు తమను తరలించాలని నిందితులు పెట్టుకున్న పిటిషన్‌పై న్యాయమూర్తి విచారించారు. వారి అభ్యర్థనను పరిగణలోని తీసుకున్న కోర్టు.. ముగ్గురు నిందితుల్ని పులివెందులలోని సబ్ జైలుకు తరలించాలని ఆదేశించింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com